# పతాకం న్యూస్
APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY // తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 133 | విశాఖపట్నం | 13-2-2026 శుక్రవారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 133 | VISAKHAPATNAM | 13-2-2026 FRIDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.

అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.

ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇన్‌చార్జ్: డి. లావణ్య

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9491286902




2లో

## రాష్ట్ర వ్యాప్తంగా కదం తొక్కిన కార్మిక లోకం


6లో

## హైబీపీతో గుండెకు సమస్యలు?


2లో

## 114 రఫేల్ యుద్ధ విమానాలు, 6 పీ8ఐ విమానాలకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్

# ట్రిపుల్ ఐటీల్లో పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పిస్తాం: లోకేశ్

**అమరావతి, పతాకం న్యూస్:** రాష్ట్రంలోని నాలుగు ట్రిపుల్ ఐటీ (ఆర్జీయూకేటీ) క్యాంపస్‌లలో పూర్తిస్థాయి, శాశ్వత మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. శాసనసభలో దీనిపై మాట్లాడిన ఆయన, ఈ క్యాంపస్‌ల అభివృద్ధికి అవసరమైన నిధుల సమీకరణ కోసం ప్రత్యేకంగా కృషి చేస్తున్నామని తెలిపారు. నిధుల కోసం ఇప్పటికే ఆర్థిక శాఖ మంత్రితో చర్చలు జరిపామని లోకేశ్ వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన 'సాస్కీ' పథకం ద్వారా నిధులు రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఇందుకోసం డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టులు (డీపీఆర్‌లు) సిద్ధం చేస్తున్నామని, తద్వారా కేంద్రం నుంచి వీలైనంత ఎక్కువ నిధులు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు.

ప్రస్తుతం రాష్ట్రంలో పనిచేస్తున్న నాలుగు క్యాంపస్‌లకు అవసరమైన నిధుల వివరాలను మంత్రి సభకు తెలియజేశారు. నూజివీడు క్యాంపస్‌లో పనులు పూర్తి చేయడానికి రూ.60 కోట్లు, అరకు వ్యాలీలో నిర్మాణాలకు రూ.40 కోట్లు అవసరమని అంచనా వేశామన్నారు. అదేవిధంగా, ఒంగోలు క్యాంపస్‌కు రెండు దశల్లో కలిపి రూ.600 కోట్లు, శ్రీకాకుళం క్యాంపస్ పనులు పూర్తి చేయడానికి రూ.300 కోట్ల వరకు నిధులు అవసరమవుతాయని ఆయన పేర్కొన్నారు.ప్రస్తుతం శాశ్వత భవనాలు లేకపోవడంతో విద్యార్థులు చదువు మధ్యలో తాత్కాలిక అకాడమీల కోసం వేర్వేరు జిల్లాలకు వెళ్లాల్సి వస్తోందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఏ జిల్లాలో ట్రిపుల్ ఐటీ చదివే విద్యార్థులు అక్కడే తమ కోర్సును పూర్తి చేయాలన్నదే తమ ప్రభుత్వ ఆలోచన అని లోకేశ్ స్పష్టం చేశారు. కేంద్రం నుంచి నిధులు తెచ్చి, శాశ్వత సౌకర్యాలను ఏర్పాటు చేసి, విద్యార్థులు చేరిన క్యాంపస్‌లోనే చదువు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఇదే సమయంలో, పుట్టపర్తిలో కొత్త



ట్రిపుల్ ఐటీ ఏర్పాటు చేసే అవకాశంపై ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి లోకేశ్ సమాధానమిచ్చారు. ఈ ప్రతిపాదనపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించి, తగిన పరిశీలన అనంతరం తుది నిర్ణయం తీసుకుంటామని ఆయన సభకు హామీ ఇచ్చారు.

# బొత్స, పార్థసారథి మధ్య సవాళ్లు, ప్రతి సవాళ్లు



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సమావేశాలు గురువారం అధికార, విపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదాలతో దద్దరిల్లాయి. సంక్షేమ పథకాల అమలుపై వైసీపీ, టీడీపీ నేతల మధ్య మాటల యుద్ధం తారస్థాయికి చేరింది. ముఖ్యంగా వైసీపీ పక్ష నేత బొత్స సత్యనారాయణ, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లతో సభా వాతావరణం వేడెక్కింది. గవర్నర్ ప్రసంగంలో పేర్కొన్న 'అన్నదాత సుఖీభవ' పథకం కింద రూ.20,000 ఇచ్చినట్లు చెప్పడం పూర్తిగా అవాస్తవమని బొత్స సత్యనారాయణ ఆరోపించారు. ప్రభుత్వం చెప్పింది నిజమని నిరూపిస్తే తాను బహిరంగంగా క్షమాపణ చెప్పడానికి సిద్ధమని సవాల్ విసిరారు. ఇదే క్రమంలో 'వసతి దీవెన' నిధులు ఇప్పటికీ విడుదల కాలేదని, ప్రైవేటు ఆసుపత్రులు 'ఆరోగ్యశ్రీ'ని నిరాకరిస్తున్నాయని, 'తల్లికి వందనం' సక్రమంగా అందడం లేదని విమర్శించారు. "మేం సభను తప్పుదోవ పట్టించడం లేదు. అధికార పక్షం మా ఆరోపణలు తప్పని రుజువు చేస్తే, మా మాటలు వెనక్కి తీసుకుని సారీ చెబుతాం" అని బొత్స స్పష్టం చేశారు. అలాగే గత 19 నెలల్లో 60 ఏళ్లు నిండిన వారికి ఎన్ని కొత్త పింఛన్లు ఇచ్చారని, తాము పెట్టిన అర్హత నిబంధనలను ఏమైనా మార్చారా (తరువాయి 2వ పేజీలో)

## విశాఖ జిల్లాలో కదం తొక్కిన 14 ట్రేడ్ యూనియన్‌లు




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ఐఎన్‌టీయుసి, ఏఐటియుసి, హెచ్‌ఎంఎస్ మరియు సిఐటియు 14 ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో ఈరోజు బందు కార్యక్రమం చేయడం జరిగింది కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలని ప్రభుత్వరంగ సంస్థలను ప్రభుత్వంలోనే కొనసాగించాలని హెచ్‌పీసీఎల్‌లో స్థానికులకే 75% ఉపాధి అవకాశాలు ఇవ్వాలని కాంటాక్ట్ కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని కాంట్రాక్ట్ కార్మికులకు ఈ ఎస్ ఐ పిఎఫ్ సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేస్తూ బంధు కార్యక్రమం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో పాల్గొన్న ట్రేడ్ యూనియన్ నాయకులు ఏఐటియుసి రాష్ట్ర నాయకులు కాండ్రేగుల సత్యాంజనేయ మరియు విశాఖ జిల్లా నాయకులు గుడాల రాంబాబు గండి అప్పారావు శ్రీనివాస్ సత్యనారాయణ రెడ్డి అజయ్ కొండబాబు మరియు సిఐటియు నాయకులు లక్షణామూర్తి పైడ్రాజు అచ్చారావు మరియు వైఎస్ఆర్సిపి నాయకులు అనిల్ అనిల్ కుమార్ మరియు ఐఎన్టీయూసీ నాయకులు సత్య రావు వీధి విక్రయిదారులు మరియు ఆటో ఓనర్ వర్కర్ బందులో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.


2లో

## అంబటి రాంబాబుపై పీటీ వారెంట్.. కోర్టులో హాజరుపరిచిన పోలీసులు



## కాకాణికి నోటీసులు జారీ చేసిన పోలీసులు

2లో


పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY // తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా.. అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా.. పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS
State Bank of India
A/c No: 44576280686
IFSC:SBIN00021297
DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

# విద్యా వ్యాపారం

రాష్ట్రంలో గత కొన్నేళ్లుగా ఉన్నత విద్యారంగం పెను మార్పులకు లోనవుతోంది. 'ప్రైవేట్ విశ్వవిద్యాలయాల చట్టం-2016' ఒక వరప్రసాదమని పాలకులు ప్రచారం చేసినప్పటికీ, క్షేత్ర స్థాయిలో అది విద్యార్థులకు ఒక 'శాపం'గా మారింది. నేడు రాష్ట్రంలో ప్రైవేట్ విశ్వవిద్యాలయాల నడక చూసినట్టయితే తాము రాజ్యాంగానికి అతీతంగా భావిస్తున్నట్టు కనిపిస్తుంది. దీనికి ఉదాహరణే గత కొంత కాలంగా మోహన్‌బాబు యూనివర్సిటీ (ఎం.బి.యు)లో జరుగుతున్న పరిణామాలు. ఎం.బి.యు లోనే కాదు మిగిలిన ప్రైవేటు, డీమ్డ్, బ్రౌన్ ఫీల్డ్ యూనివర్శిటీలలోనూ ఇదే తంతు సాగుతున్నది. దోపిడి పెంచుకునేందుకే కావచ్చు ఎత్తైన భవనాలు, రంగురంగుల బ్రోచర్లతో విద్యార్థుల తల్లిదండ్రులను ఆకట్టుకుంటున్నారు. ఒక్కసారి కాలేజీలోకి అడుగుపెట్టిన తరువాత విద్యార్థి మేధస్సు కంటే తల్లిదండ్రుల పర్సుకే ప్రాధాన్యత పెరుగుతుంది. మోహన్‌బాబు యూని వర్సిటీలో వెలుగు చూసిన ఫీజుల కుంభకోణం నేపథ్యంలో ఉన్నత విద్యా నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ జరిపిన విచారణలో ఎవరూ ఊహించని నిజాలు బయటపడ్డాయి. అకడమిక్ ఫీజు కాకుండా 'కెరీర్ డెవలప్‌మెంట్' పేరుతో ఒక్కో విద్యార్థి నుండి రూ.50,000 నుండి రూ.1,00,000 అదనంగా వసూలు చేశారు. డే-స్కాలర్ విద్యార్థుల నుండి కూడా మెస్, హాస్టల్ చార్జీలు వసూలు చేస్తున్నట్లు నివేదిక తేల్చింది. బిల్డింగ్ ఫీజు, ట్రాన్స్‌పోర్ట్ ఫీజు, ఇతర అడ్మినిస్ట్రేటివ్ ఫీజుల పేరుతో అదనంగా రూ.26.17 కోట్లు అక్రమంగా వసూలు చేసి పోగేసుకుంది యాజమాన్యం. ఇవి అధికారిక లెక్కలు మాత్రమే. అంతేకాకుండా అటెండెన్స్ మేనేజ్‌మెంట్‌లో అక్రమాలు, విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను దగ్గర పెట్టుకోవడం వంటి తీవ్రమైన ఉల్లంఘనల కారణంగా, యూనివర్సిటీ గుర్తింపును రద్దు చేయాలని యుజిసి, ఎఐసిటిఇ కి కమిషన్ సిఫార్సు చేసింది. విద్యార్థుల బాధ్యతలు శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీకి అప్పగించాలని సిఫారసు చేసింది. దీనితో యూనివర్శిటీ గుర్తింపు రద్దు విషయమై హైకోర్టు స్టే విధించింది. అప్పటికీ బుద్ధిమారని యాజమాన్యం ఈ విద్యా సంవత్సరం కూడా అదనంగా ఒక్కో విద్యార్థి నుండి రూ.40 వేలు వసూలు చేసింది. చెల్లించని వారికి మిడ్ పరీక్షలకు అనుమతులు ఉండవని హుకుం జారీచేసింది. పెద్ద పెద్ద పబ్బుల్లో చూసినట్టుగా యూని వర్శిటీలో బౌన్సర్ల సంస్కృతి కొనసాగుతున్నది. యుజిసి నిబంధనల ప్రకారం క్యాంపస్‌లో విద్యార్థుల పట్ల క్రమశిక్షణా చర్యలు తీసుకోవడానికి 'ప్రొక్టోరియల్ బోర్డు' ఉండాలి తప్ప, ప్రైవేట్ సైన్యం లాంటి బౌన్సర్లు ఉండకూడదు. యూనివర్సిటీల్లో బౌన్సర్లు ఉండటం చట్టబద్ధం కాదు. అది విద్యాసంస్థలను రౌడీయిజానికి కేంద్రాలుగా మారుస్తుంది. విద్యాసంస్థల్లో ప్రైవేట్ వ్యక్తులు లేదా బౌన్సర్లను నియమించుకుని చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడాన్ని పంజాబ్, హర్యానా హైకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. చండీగఢ్‌లోని క్లబ్‌లు, విద్యాసంస్థలకు సంబంధించిన కేసులో కీలక ఆదేశాలు జారీ చేసింది. ఇదేదో ఎం.బి.యు కే పరిమితం కాదు. మిగిలిన ప్రైవేటు యూనివర్శిటీలలోనూ ఇటువంటి వ్యాపారం వేరే పేర్లతో జరుగుతున్నది. కె.ఎల్.యు సంస్థలకు అనుకూలంగా న్యాక్ రేటింగ్ (3.65 పాయింట్లు, అంతకంటే ఎక్కువ) ఇచ్చేందుకు ఒక డీల్ కుదిరినట్లు సిబిఐ తేల్చింది. విట్, ఎస్.ఆర్.ఎం యూనివర్శిటీ అనుబంధ హాస్టల్‌లో మాత్రమే విద్యార్థి ఉండాలి. బయట ఉండేందుకు వీలు లేదు. కన్వీనర్ కోటా విద్యార్థులకు ప్రభుత్వం నుంచి ఫీజులు అందకపోయినా పరీక్షా సమయంలో ఫీజులు చెల్లించాల్సిందే. లేని పక్షంలో విద్యార్థులపై అదనంగా ఫైన్లు వేసి వసూళ్లకు పాల్పడుతున్న ఘటనలున్నాయి. ఈ ఉదంతాలు కేవలం ఒకటి లేదా రెండు యూనివర్సిటీలకు సంబంధించిన సమస్య కాదు. రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ వర్సిటీల గత ఐదేళ్ల ఆర్థిక లావాదేవీలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జిలతో విచారణ జరిపిస్తే అసలు రంగు బయటకు వస్తుంది. విద్యా వ్యాపారానికి ఎన్ఇపి మరింత చట్టబద్ధత కల్పిస్తోంది. 'గ్రేడెడ్ అటానమీ' పేరుతో వర్సిటీలకు ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచుకునే అధికారాన్ని ఇచ్చింది. విద్యను 'లాభాపేక్ష లేని సేవ'గా చూడాలన్న సుప్రీంకోర్టు తీర్పులను ఈ పాలసీ తుంగలో తొక్కింది. ప్రైవేటు యూనివర్సిటీల ప్రవేశ పరీక్ష ద్వారా జరిపిన సీట్ల భర్తీలో రిజర్వేషన్లు వర్తించవు. దళిత, గిరిజన బడుగు బలహీన వర్గాలకు, అన్ని వర్గాల పేదలకు సీట్లు నిరాకరిస్తున్నారు. మేనేజ్‌మెంట్ కోటా సీట్లను బహిరంగంగా వేలం వేస్తున్నారు. ఇది రాజ్యాంగం కల్పించిన విద్యా హక్కును కాలరాయడమే. ఎ.యు, ఎస్.వి వంటి చారిత్రక విద్యా సంస్థలకు నిధులు కత్తిరించి, అధ్యాపకుల భర్తీలను నిలిపివేసి, ప్రైవేట్ వర్సిటీలకు భూములు కట్టబెట్టడం, రాయితీలు ఇవ్వడం ప్రభుత్వ విద్య ప్రాధాన్యతను తగ్గించివేస్తుంది. డబ్బున్న వారికి ఏసీ రూములు, పెద్ద చదువు. పేదవారికి శిథిలమైన ప్రభుత్వ కాలేజీలు. ఈ విభజన రేపటి సమాజంలో తీవ్రమైన అసమానతలకు దారితీస్తుంది. నేడు ఈ ప్రైవేట్ వర్సిటీలు కేవలం 'డిగ్రీలు ఇచ్చే కర్మాగారాలు'గా మారాయి. రంగురంగుల బ్రోచర్లు ఉన్నాయి కానీ, ప్రాక్టికల్ నాలెడ్జ్ ఇచ్చే ల్యాబులు లేవు. తీవ్రమైన వేధింపులను తట్టుకోలేక రాష్ట్రంలో ప్రతి ఏటా పదుల సంఖ్యలో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

## అంబటి రాంబాబుపై పీటీ వారెంట్.. కోర్టులో హాజరుపరిచిన పోలీసులు




**గుంటూరు, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన సంక్రాంతి లక్కీ డ్రా కేసులో వైసీపీ కీలక నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు చట్టపరమైన ఇబ్బందులు తప్పలేదు. సత్తెనపల్లి పోలీసులు గురువారం ఆయనను గుంటూరులోని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరిచారు. ఈ ఘటన వైసీపీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. 2023 సంక్రాంతి పండుగ సమయంలో సత్తెనపల్లి నియోజకవర్గంలో సంక్రాంతి లక్కీ డ్రా నిర్వహించారని ఆయనపై పోలీసులు కేసు నమోదు చేశారు. అంబటి రాంబాబు సంక్రాంతి లక్కీ డ్రా పేరుతో బలవంతంగా ప్రజలకు టికెట్లు అంటగట్టారని జనసేన నేతలు ఆరోపించారు. ప్రజలను బెదిరించి టికెట్లు కొనిపించారని, ఇది చట్టవిరుద్ధమని జనసేన నేతలు సత్తెనపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. జనసేన నేతల ఫిర్యాదు మేరకు పోలీసులు అంబటి రాంబాబుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా సత్తెనపల్లి పోలీసులు గురువారం ఆయనని గుంటూరులోని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరిచారు. అంబటిపై ఉన్న పీటీ వారెంట్ కారణంగా పోలీసులు ఈ చర్య తీసుకున్నారు. కోర్టులో ఆయనని హాజరుపరచడంతో.. ఈ కేసులో విచారణ వేగవంతం కానుంది. ఈ కేసుపై రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

## పవన్‌ను కలిసిన నందమూరి బాలకృష్ణ



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌ను హిందూపురం టీడీపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, జనసేన ఎమ్మెల్సీ నాగబాబు వేర్వేరుగా కలిశారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఉప ముఖ్యమంత్రి ఛాంబర్‌లో బాలకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఇరువురు ప్రస్తుత పరిణామాలు, వివిధ అంశాలపై చర్చించినట్లుగా సమాచారం. ఆ తర్వాత నాగబాబు కూడా సోదరుడిని కలిశారు. అంతకుముందు, శాసనసభలో మంత్రి లోకేశ్, నందమూరి బాలకృష్ణ పక్కపక్కనే కూర్చుని మాట్లాడుకోవడం అందరి దృష్టిని ఆకర్షించింది. బాలకృష్ణ ఏదో చెబుతుండగా లోకేశ్ ఆసక్తిగా వింటున్నట్లు కనిపించింది. ఇదిలా ఉండగా, గిద్దలూరు నియోజకవర్గం సమస్యలపై పవన్ కల్యాణ్‌కు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి వినతి పత్రం అందజేశారు.

## కాకాణికి నోటీసులు జారీ చేసిన పోలీసులు



**నెల్లూరు, పతాకం న్యూస్:** గత కొన్ని రోజులుగా వైసీపీ నేతలకు వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేశ్ ల అరెస్టులు, రిమాండ్లు అందరికీ తెలిసిందే. ఇప్పుడు మరో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి వంతు వచ్చింది. ఆయనకు నెల్లూరు జిల్లా కోవూరు పోలీసులు నోటీసులు జారీ చేశారు. గుమ్మలదిన్నెలో బాలిక మృతిపై నిరాధార ఆరోపణలు చేశారని, ఈ నెల 14న ఉదయం 11 గంటలకు విచారణకు హాజరుకావాలని నోటీసుల్లో పోలీసులు పేర్కొన్నారు. నెల్లూరులోని ఆయన నివాసంలో నోటీసులు అందజేశారు. నోటీసులపై కాకాణి ఇంకా స్పందించాల్సి ఉంది. మరోవైపు, నెల్లూరు జిల్లాలో జరిగిన అక్రమ మైనింగ్ కేసులో కాకాణి ఇప్పటికే జైలుకు వెళ్లిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆయన బెయిల్ పై బయట ఉన్నారు. బెయిల్ పై బయటకు వచ్చినప్పటి నుంచి ఆయన కూటమి ప్రభుత్వంపై విమర్శల దాడిని మరింత పెంచారు.

## బీఆర్ఎస్‌కు అధికారం ఇచ్చినా చేదు జ్ఞాపకాలే మిగిలాయి: కవిత

**హైదరాబాద్, పతాకం న్యూస్:** కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ ఉద్యమం సాగినప్పుడు ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలకు న్యాయం జరుగుతుందని భావించామని... కానీ రాష్ట్రం వచ్చాక తీరని అన్యాయం జరిగిందని కేసీఆర్ కుమార్తె, జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. బాగ్ లింగంపల్లిలో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో జరిగిన ఉద్యమకారుల ఆత్మగౌరవ సభలో కవిత మాట్లాడుతూ... ఉద్యమ సోయి లేని రేవంత్ రెడ్డి సీఎం కావడం తెలంగాణ చేసుకున్న దౌర్భాగ్యమని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను రాబోయే బడ్జెట్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం తప్పక నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

## ఎన్టీఆర్‌కు భారతరత్న వచ్చేలా కృషి చేయాలి: కొణతాల



**అమరావతి, పతాకం న్యూస్:** ఏపీ శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి జనసేన పార్టీ తరఫున ధన్యవాదాలు తెలిపే సందర్భంగా ఆ పార్టీ నేత, అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కీలక వ్యాఖ్యలు చేశారు. మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్‌కు భారతరత్న వచ్చేలా కృషి చేయాలన్నారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇస్తే ఆంధ్రులకు, తెలుగు జాతికి గౌరవం చేకూరినట్టు అవుతుందని అన్నారు. దీనిపై తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని అసెంబ్లీని ఎమ్మెల్యే కోరారు. అలాగే, చంద్రబాబు నాయుడు కుటుంబ సభ్యుల ప్రతిభను ప్రత్యేకంగా ప్రస్తావించారు ఎమ్మెల్యే. మంత్రి నారా లోకేశ్ కుమారుడు నారా దేవాన్ష్ చెస్ రంగంలో అద్భుత సాధన చేశారని తెలిపారు. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో 'ఫాస్టెస్ట్ చెక్‌మేట్ సాల్వర్'గా రికార్డు సృష్టించారని తెలిపారు. 9 చెస్ బోర్డులపై 32 పాన్‌లను 5 నిమిషాల్లో దేవాన్ష్ సాల్వ్ చేసి రికార్డు నెలకొల్పారని ఎమ్మెల్యే అన్నారు. నారా భువనేశ్వరికి 2025లో 'అవుట్‌స్టాండింగ్ డెయిరీ ప్రొఫెషనల్ అవార్డు'ను ఇండియన్ డెయిరీ అసోసియేషన్ ఇచ్చిందని అన్నారు. నారా బ్రాహ్మణికి గోల్డెన్ పీకాక్ ఎక్సలెన్స్ అవార్డు, మోస్ట్ పవర్‌ఫుల్ ఉమెన్ ఇన్ ఇండియా, యూకే కార్పొరేట్ ఎక్సలెన్స్ అవార్డులు లభించాయన్నారు. ఈ అవార్డులు నారా కుటుంబ సభ్యుల ప్రతిభకు అద్దం పడుతున్నాయని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పేర్కొన్నారు.రాష్ట్రం.. 25 శాతం పెట్టుబడులతో పాటు దేశ గ్రోత్ రేటును అధిగమించినట్లు ఎమ్మెల్యే చెప్పారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల మధ్య సమన్వయంతో 'త్రిపుల్ ఇంజిన్ సర్కార్'గా పనిచేస్తోందని కొనియాడారు. విద్యుత్ చార్జీల తగ్గింపు, సీఎంకు బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు వంటివి రాష్ట్రానికి గౌరవం తెచ్చాయన్నారు. విశాఖపట్నంలో సుమారు 5-6 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. విశాఖ ఉక్కు కర్మాగారం లాభాల బాట పట్టేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అత్యంత తక్కువ ఖర్చుతో రూ.5000 కోట్లతో 30 లక్షల ఎకరాలు సాగులోకి తీసుకొచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని చెప్పారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రూ.12 వేల కోట్లతో 4 వేల కిలోమీటర్ల రోడ్లు నిర్మించారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గవర్నర్ ప్రసంగానికి జనసేన తరఫున ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ధన్యవాదాలు తెలిపారు.

## 114 రఫేల్ యుద్ధ విమానాలు, 6 పీ8ఐ విమానాలకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ఫ్రాన్స్ నుంచి 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించిన కీలకమైన డిఫెన్స్ డీల్‌కు కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రూ.3.25 లక్షల కోట్ల విలువైన డీల్ ఇది. ఈ డీల్‌కు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలోని ఢిఫెన్స్ కౌన్సిల్ ఆమోదం తెలిపినట్టు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. భారత నావికా దళం కోసం 6 పీ8i (P8i) విమానాలను కొనుగోలు చేసే డీల్‌ను కూడా ఆమోదించినట్టు తెలిపాయి. రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు డీల్‌తో భారత వాయిసేన పోరాట సామర్థ్యం మరింత పెరుగుతుంది. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ఈ నెల ద్వితీయార్థంలో భారత్ పర్యటనకు రానున్నారు. ఈ సందర్భంగానే డిఫెన్స్ డీల్‌పై సంతకాలు జరిగే అవకాశాలున్నాయి. డీల్ ప్రకారం 18 రఫేల్ జట్లను 'ఫ్లై-అవే కండిషన్'లో నేరుగా తీసుకువస్తారు. తక్కిన 96 విమానాలు ఇండియాలో అసెంబుల్ చేస్తారు. 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమంలో భాగంగా స్థానికంగా తయారీ, అసెంబెల్ కోసం రఫేల్ మాతృ సంస్థ డసో ఏవియేషన్, భారత్‌తోని ప్రైవేటు రంగ సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకుంటారు. భారత వాయిసేన వద్ద ప్రస్తుతం 36 రఫేల్ యుద్ధవిమానాలు ఉన్నాయి.

## బొత్స, మంత్రి పార్థసారథి మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లు!

(మొదటిపేజీ తరువాయి)

అని ప్రభుత్వాన్ని నిలదీశారు. బొత్స ఆరోపణలకు మంత్రి కొలుసు పార్థసారథి అంతే దీటుగా స్పందించారు. బొత్స సవాల్‌ను స్వీకరిస్తున్నట్లు ప్రకటించారు. 'తల్లికి వందనం' నిధులు నియోజకవర్గాలు, జిల్లాల వారీగా పంపిణీ చేసినట్లు పత్రాలతో సహా నిరూపిస్తామని, ఒకవేళ రుజువు చేయలేకపోతే ఏ శిక్షకైనా సిద్ధమని ప్రతిసవాల్ విసిరారు. 'అన్నదాత సుఖీభవ' కింద 48 లక్షల మందికి లబ్ధి చేకూరితే, "ఒక్కరికీ పడలేదు" అనడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. "నేను ఛాలెంజ్ చేస్తున్నా. రండి చెక్ చేద్దాం" అంటూ బొత్సను చర్చకు ఆహ్వానించారు. ఈ చర్చలో పింఛన్ల అంశంపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ జోక్యం చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత 20 నెలల్లో ఒక్క పింఛనూ తొలగించలేదని స్పష్టం చేశారు. 4.7 లక్షల మరణాల కారణంగా 2.7 లక్షల పింఛన్లు ఆగిపోయాయని, ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 63.2 లక్షల మందికి పింఛన్లు అందిస్తున్నామని వివరణ ఇచ్చారు. మొత్తం మీద, సంక్షేమ పథకాల అమలు విషయంలో ఇరుపక్షాల ఆరోపణలు, ప్రత్యారోపణలతో మండలిలో రాజకీయ వేడి కొనసాగుతోంది.

# అప్పికొండలో మహాశివరాత్రికి పటిష్ట ఏర్పాట్లు చేయాలి: కలెక్టర్ హరేంధిరప్రసాద్



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** అప్పికొండ సోమేశ్వర స్వామి ఆలయంలో 15న జరగనున్న మహాశివ రాత్రి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ ఆదేశించారు. తన ఛాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన ఆయన పలు అంశాలపై మార్గదర్శకాలు జారీ చేశారు. మహాశివరాత్రి సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చే అవకాశం ఉన్నందున భద్రత, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, విద్యుత్, వైద్య సదుపాయాలు వంటి అన్ని మౌలిక వసతులను ముందుగానే సిద్ధం చేయాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీస్ శాఖ ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్లు సక్రమంగా ఏర్పాటు చేయాలన్నారు. ఆలయ ప్రాంగణంలో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, అవసరమైన చోట తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విశాఖపట్టణం ఆర్‌డిఒ సుధాసాగర్, డిఎంహెచ్ఒ డాక్టర్ జగదీశ్వరరావు, ఆలయ ఈవో పద్మావతి, పోలీస్, రెవెన్యూ, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఐఎఫ్ఆర్ విజయవంతానికి విస్తృత ఏర్పాట్లు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** నగరంలో జరగనున్న ఐఎఫ్ఆర్ (ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ) విజయవంతానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ తెలిపారు. తన ఛాంబర్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఐఎఫ్ఆర్‌లో భాగంగా ఈనెల 19వ తేదీ సాయంత్రం ఐదు నుంచి ఏడు గంటల వరకు బీచ్‌రోడ్‌లో సిటీ పరేడ్ జరగనున్నదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ముఖ్య అతిథిగా పాల్గొనే సిటీ పరేడ్‌కు లక్షన్నర నుంచి రెండు లక్షల మంది సందర్శకులు వస్తారని అంచనా వేస్తున్నామన్నారు. అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. సముద్రంలో నేవీ విన్యాసాలు, తీరంలో డ్రోన్ షో ఉంటాయన్నారు. ఇంకా పలు దేశాలకు చెందిన నేవీ బృందాలు, దేశంలో పలు ప్రాంతాలకు చెందిన కళాకారులతో సాంస్కృతిక ప్రదర్శన (పార్కు హోటల్ నుంచి కోస్టల్ బ్యాటరీ వరకూ) ఉంటుందన్నారు. రాష్ట్ర చరిత్ర, సంస్కృతి, అభివృద్ధి తెలియజేసేలా రెండు శకటాలు పరేడ్‌లో పాల్గొంటాయన్నారు. పరేడ్‌కు వచ్చే ప్రముఖులు, నౌకాదళ అధికారులు, సిబ్బందికి నౌకాదళం, సందర్శకుల కోసం రోడ్లు, భవనాల శాఖ సీటింగ్ ఏర్పాట్లు చేస్తున్నాయన్నారు. 19వ తేదీన సిటీ పరేడ్‌ను లైవ్‌లో తిలకించేందుకు వుడా పార్కు, ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపాన గల సెంట్రల్‌పార్కులో బిగ్ స్క్రీన్లు ఏర్పాటుచేస్తామని కలెక్టర్ తెలిపారు. కాగా 18వ తేదీన బీచ్‌లో ఫుల్ డ్రెస్ రిహార్సల్స్ ఉంటాయన్నారు. పరేడ్‌లో మాదిరిగా సాంస్కృతిక ప్రదర్శనలు, డ్రోన్ షో, సముద్రంలో నేవీ విన్యాసాలు ప్రదర్శిస్తారన్నారు. అందువల్ల నగర ప్రజలు కొందరు 18వ తేదీన నిర్వహించే రీహార్సల్స్‌కు హాజరుకావాలని కోరారు. నేవీ అధికారులు, సిబ్బంది వాహనాలను విశ్వప్రియ ఫంక్షన్‌హాలు వెనుక ఏపీఐఐసీ మైదానం, ఏయూ ఎగ్జిబిషన్ మైదానం, ప్రభుత్వ అధికారులు, సందర్శకుల వాహనాలు ఏయూ ఫుట్‌బాల్ మైదానం, ఇతర ప్రాంతాల్లో నిలపవలసి ఉంటుందన్నారు.

## నిరుపయోగంగా సంత సముదాయం



**చింతపల్లి, పతాకం న్యూస్:** మండల కేంద్రంలో రూ.25 లక్షల నాబార్డు, పంచాయతీ నిధులతో నిర్మించిన సంత షెడ్లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు నిర్మించిన షెడ్లను వ్యాపారులు వినియోగించడం లేదు. వర్తకులు సంతలోని దుకాణాలను రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసుకోవడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. సంబంధితశాఖ అధికారులు పట్టించుకోకపోవడం వల్ల ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రతి చింతపల్లి వారపు సంత జరుగుతుంది. మండలంలో చింతపల్లి సంత పెద్దది కావడంతో వందల సంఖ్యలో వర్తకులు, వేల సంఖ్యలో వినియోగదారులు వస్తారు. సంత రోజు హనుమాన్ జంక్షన్ నుంచి డిగ్రీ కళాశాల వరకు రద్దీగా వుంటుంది. గతంలో సంత రోజు పాత బస్టాండ్ నుంచి డిగ్రీ కళాశాల సంతబయలు వరకు వర్తకులు రహదారికి ఇరువైపులా దుకాణాలు ఏర్పాటు చేసేవారు. దీంతో ట్రాఫిక్ సమస్య పెరిగిపోవడంతో నాబార్డు రూ.20లక్షలు, పంచాయతీ రూ.ఐదు లక్షల నిధులు వెచ్చించి సంతబయలు వద్ద 45 దుకాణాల సముదాయాన్ని నిర్మించారు. ఈ దుకాణాలు రెండేళ్ల క్రితం అందుబాటులోకి వచ్చాయి. ఈ దుకాణాలను కూరగాయల వర్తకులకు కేటాయించారు. సంతబయలు ఖాళీ స్థలాన్ని ఫ్యాన్సీ, దుస్తులు, ఇతర దుకాణాల వ్యాపారులకు అప్పగించారు. సుమారు ఆరు నెలల వరకు సంత షెడ్లలోనే వర్తకులు దుకాణాలు ఏర్పాటు చేశారు. దీంతో రహదారికి ఇరువైలా దుకాణాలు ఉండేవికావు. ట్రాఫిక్ సమస్య పూర్తిగా తగ్గింది. అయితే కొంత కాలంగా సంత షెడ్లలో ఉన్న దుకాణాలు ఒక్కొక్కటి రహదారి పక్కన ఏర్పాటు చేయడం ప్రారంభించారు. ప్రస్తుతం సంత షెడ్లు పూర్తిగా ఖాళీ అయిపోయాయి. దుకాణాలన్నీ రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేయడంతో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన సంత షెడ్లు వృ?థాగా పడివున్నాయి. ప్రస్తుతం మందుబాబులు, యాచకులు ఈ షెడ్లను వినియోగిస్తున్నారు. కాగా రహదారికి ఇరువైపులా దుకాణాలు ఏర్పాటు చేయడం వల్ల ట్రాఫిక్ సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. ఇప్పటికైనా రెవెన్యూ, పోలీసు, మండల పరిషత్, పంచాయతీ అధికారులు స్పందించి రహదారికి ఇరువైపులా ఉన్న దుకాణాలను సంత షెడ్లకు తరలించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

## అంబులెన్స్‌ను ప్రారంభించిన కలెక్టర్



**పాడేరు, పతాకం న్యూస్:** అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంత రోగులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు గాను యూనివర్సల్ సోంపో జనరల్ ఇన్సురెన్స్ సౌజన్యంతో సమకూర్చిన ఒక నూతన అంబులెన్స్‌ను కలెక్టరేట్ ప్రాంగణంలో కలెక్టర్ దినేష్ కుమార్ ప్రారంబించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ప్రమాదాలకు గురైన వారికి అత్యవసర సేవలు అందించుటకు ఈ అంబులెన్స్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ వాహనం డుంబ్రిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అందించడం జరిగిందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కృష్ణమూర్తి నాయక్ తెలియజేసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో ఇప్పటికే పి.హెచ్.సి అంబులెన్స్‌లు, 108 అంబులెన్స్ సేవలు, 102 (తల్లి బిడ్డ ఎక్స్ప్రెస్) వాహన సేవలు, 104 వాహన వైద్య శిభిరాలు, బైక్ అంబులెన్స్ సేవల ద్వార రోగులను సకాలంలో ఆసుపత్రులకు తరలించి వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాడేరు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కృష్ణమూర్తి నాయక్, అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ప్రతాప్ పాల్గొన్నారు.

## టెన్త్‌లో శతశాతం ఫలితాలకు కసరత్తు



**పాడేరు, పతాకం న్యూస్:** పదవ తరగతిలో శత శాతం ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంతో విద్యాశాఖ కృషి చేస్తోంది. ఇందులో భాగంగా అధికారులు పదవ తరగతి విద్యార్థుల కోసం గతేడాది డిసెంబరు ఆరో తేదీ నుంచి 100 రోజుల ప్రత్యేక ప్రణాళికను అమలు చేస్తున్నారు. గతంలో గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు వేర్వేరుగా ప్రత్యేక ప్రణాళికను అమలు చేసేవారు. కానీ ఈ విద్యా సంవత్సరంలో అన్ని ఉన్నత పాఠశాలల్లోనూ ఒకే తరహా వంద రోజుల ప్రత్యేక ప్రణాళికను అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఉమ్మడి అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉన్న 250 ఉన్నత/ఆశ్రమ పాఠశాలల్లో ఉన్న సుమారు 11,500 మంది పదవ విద్యార్థులకు ప్రత్యేక ప్రణాళికలో భాగంగా ప్రత్యేక బోధన సాగాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో గత ఏడాది కేవలం 48 శాతం మాత్రమే ఉత్తీర్ణత సాధించడంతో ఈ ఏడాది శత శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా సబ్జక్టు టీచర్లు, ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. దీంతో విద్యార్థులకు ప్రతి రోజూ పరీక్షలు, ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది జనవరిలో నిర్వహించిన ప్రీ ఫైనల్ పరీక్షలకు 11,143 మంది హాజరుకాగా, ఏ- గ్రేడులో 144 మంది, బీ- గ్రేడులో 1,549, సీ- గ్రేడులో 6,591, డి- గ్రేడులో 2,405 మంది విద్యార్థులున్నారు. ఈ నేపథ్యంలో వంద రోజుల ప్రత్యేక ప్రణాళికపై విద్యాశాఖ మరింత శ్రద్ధ కనబరుస్తున్నది.

## గిరిజన గ్రామాల్లో పర్యటించిన ఐటీడీఏ అధికారి



**బొబ్బిలి, పతాకం న్యూస్:** గోపాలరాయుడిపేట పంచాయతీకి చేరువలోని ఐదు గిరిజన గ్రామాలను జిల్లా గిరిజన సంక్షేమ అధికారి శ్రీనివాసరావు పర్యటించారు. ఈ సందర్భంగా గిరిజనులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కృపావలస గ్రామపెద్ద సీహెచ్.సీతయ్య మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా మేము ఇక్కడే నివాసం ఉంటున్నామని, మా గ్రామాలను గోపాల రాయుడిపేట పం చాయతీలో విలీనం చేయాలని, సంక్షేమ పథకాలు అమ లు చేయాలని కలెక్టర్, ఐటీడీఏ పీవో, మంత్రి సంధ్యారాణి, ఎస్టీ కమిషనర్ స్థానిక ఎమ్మెల్యేకు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేకుందని ఇంత వరకూ ఎవరూ మా సమస్యలను పరిష్కరించలేదని గిరిజన సంక్షేమ అధి కారి తెలిపారు. సమస్యలను లిఖిత పూర్వకంగా ఇవ్వాలని అధికారి కోర డంతో వారు వినతిపత్రం అందజేశారు. ఆక్కడి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు

## వెలంపేట, ఇందిరానగర్ మురికివాడల అభివృద్ధి: కమిషనర్ కేతన్‌గార్గ్



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** గ్రేటర్ విశాఖ బ్యూరో విశాఖ ఎకనమిక్ రీజియన్ (విఇఆర్)లో నగరంలోని మురికివాడలైన వెలంపేట, ఇందిరానగర్ ప్రాంతాల రూపురేఖలను మార్చే దిశగా జివిఎంసి ప్రణాళిక చేపట్టిందని జివిఎంసి కమిషనర్ కేతర్ గార్గ్ వెల్లడించారు. తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విశాఖ ఎకనమిక్ రీజియన్‌లో నగరంలోని వెలంపేటలోగల 177 మందికి, ఇందిరానగర్‌లోగల 110 మందికి అదే ప్రాంతంలో ఫ్లాట్స్‌ను డెవలప్ చేసి ఇచ్చేందుకు పైలట్ ప్రాజెక్టుగా పిపిపిలో పనులు ప్రారంభించనున్నామని చెప్పారు. డిజైన్ బిల్ట్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ (డిబిఒటి) కింద 18 నెలల్లో ప్రజలకు ఇళ్లను హేండోవర్ చేస్తామని, ఆ తర్వాత జివిఎంసి ఈ ప్రాంతాలను స్వాధీనం చేసుకుని మరింత అభివృద్ధి చేస్తుందన్నారు. 18 నెలల్లో ట్రాన్సిట్ హౌసింగ్ కింద వీరు వేరొక చోటకు అయినా వెళ్లాలి లేదంటే జివిఎంసిఎక్కడైనా వారు ఉండేలా అద్దె చెల్లింపు చేస్తుందని తెలిపారు. వెలంపేటలో జి ప్లస్ 11 ఫ్లోర్లను రూ.23.17కోట్లతో అంచనా వేశామని, కేంద్రం ఒక ఇంటికి రూ.1.50లక్షలు, రాష్ట్రం రూ.లక్ష లబ్ధిదారునికి ఇస్తుందని చెప్పారు. వెలంపేట, ఇందిరానగర్‌లో వసతుల ఏర్పాటుకు జివిఎంసి రూ.8.85కోట్లు ఖర్చుచేయబోతుందన్నారు. ప్రతి ఫ్లాట్ 320 చదరపు గజాలు ఉంటుందన్నారు. 440 చదరపు గజాలు బిల్టప్ ఏరియా ఉంటుందని ఇందిరానగర్ కాలనీలో జి ప్లస్ 6 ఫ్లాట్స్ నిర్మాణం చేపట్టే ప్లాన్ రూపొందిస్తున్నామన్నారు. జోనల్ డెవలప్ మెంట్ ప్లాన్‌నగరంలోని 8 జోన్లను ఇటీవలే 10కి పెంచి, వీటి అభివృద్ధి కోసం జోనల్ కాన్ఫరెన్స్‌లు నిర్వహించి కార్పొరేటర్లు, ప్రజలను భాగస్వామ్యం చేయడం ద్వారా కొత్త జోన్లలోనూ సౌకర్యాలు ఏర్పాటు చేస్తామన్నారు. నగరంలో 26 రోడ్ల అభివృద్ధే లక్ష్యంగా రూ.60కోట్లతో పనులను చేపట్టామన్నారు. 18.85కోట్లు ఐఎఫ్ఆర్‌లో లైటింగ్, రహదారులు, గ్రీన్ బెల్ట్ వర్క్స్ కోసం కేటాయిస్తున్నట్లు తెలిపారు. భోగాపురం ఎయిర్‌పోర్టుకు కనెక్టివిటీ రోడ్లునూతనంగా నిర్మాణం అవుతున్న ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు (భోగాపురం)నకు అనుసంధానంగా నగరంలో 7 రోడ్లను జివిఎంసి చేపడుతుందన్నారు. వీటిలో 2 రోడ్లు వేపగుంట నుంచి పినగాడి, వేపగుంట నుంచి జుత్తాడ వరకూ విఎంఆర్‌డిఎ, జివిఎంసి సంయుక్తంగా పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. మే నాటికి ఈ పనులన్నీ పూర్తవుతాయన్నారు. నగరంలో 66 మురికివాడల్లో 2300 కుటుంబాలున్నాయని తెలిపారు. రెండో కేటగిరీలో మరో 50 స్లమ్స్‌ను గుర్తించామని, పిపిపి మోడల్‌లో అభివృద్ధి చేస్తామన్నారు. 3.0 ఆపరేషన్ లంగ్స్ సెల్లార్‌ల్లో ప్రారంభిస్తామని చెప్పారు. ఆస్థి పన్ను వసూళ్లలో వెనుకబడకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పనిచేస్తున్నానని, రూ.963 కోట్లలో ఇంకా రూ.422కోట్లు పెండింగ్‌లో ఉన్నట్లు వివరించారు.

## బలిమెల జలాశయం నీటి వినియోగంపై సమీక్ష



**సీలేరు, పతాకం న్యూస్:** ఉమ్మడి నిర్వహణలో ఉన్న బలిమెల జలాశయంలోని నీటి వినియోగంపై ఆంధ్రా, ఒడిశా అధికారులు సీలేరు ఏపీ జెన్‌కో అతిథి గృహంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రస్తుతం బలిమెల, జోలాపుట్టు జలాశయాల్లో నీటి నిల్వలు ఎంతెంత ఉన్నాయో లెక్కలు కట్టారు. 2025- 2026 నీటి సంవత్సరంలో ఇప్పటి వరకు ఏ రాష్ట్రం తమ వాటాగా ఎన్ని టీఎంసీల నీటిని వినియోగించిందో తేల్చారు. ప్రస్తుతం బలిమెల జలాశయంలో 65.6500 టీఎంసీలు, జోలాపుట్టులో 20.1999 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. ఈ నెలాఖరు నాటికి బలిమెల జలాశయానికి 0.6000 టీఎంసీలు, జోలాపుట్టు జలాశయానికి 0.40000 టీఎంసీల నీటి నిల్వలు పరివాహక ప్రాంతాల నుంచి వచ్చి చేరతాయని లెక్కలు కట్టారు. దీని ప్రకారం బలిమెల, జోలాపుట్టు జలాశయాల్లో మొత్తంగా 86.8499 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయని, ఇందులో ఆంధ్రా వాటాగా 58.3670 టీఎంసీలు, ఒడిశాకు 28.4829 టీఎంసీలుగా ఇరు రాష్ట్రాల మధ్య పంపకాలు జరిగాయి. 2025- 2026 నీటి సంవత్సరంలో జూలై 2025 నుంచి జనవరి 26 వరకు బలిమెల జలాశయం నుంచి ఆంధ్రా తన వాటాగా 28.3996 టీఎంసీల నీటిని వినియోగించుకున్నట్టు, అలాగే ఒడిశా తన వాటాగా 58.2836 టీఎంసీలు వినియోగించుకున్నట్టు తేల్చారు. దీని ప్రకారం 2025- 2026 నీటి సంవత్సరంలో జనవరి నెలాఖరు నాటికి ఆంధ్రా కంటే ఒడిశా 29.8840 టీఎంసీల నీటిని అధికంగా వినియోగించుకున్నట్టు గుర్తించారు. ప్రస్తుతం విద్యుత్ డిమాండ్, రబీ పంటలకు నీటి అవసరాల నేపథ్యంలో ఆంధ్రాకు 6,500 క్యూసెక్కుల నీటిని, ఒడిశాకు 3 వేల క్యూసెక్కుల నీటిని ఈ నెలాఖరు వరకు వినియోగించుకోవడానికి ఇరు రాష్ట్రాల మధ్య ఒప్పందం కుదిరింది. ఈ కార్యక్రమంలో ఆంధ్రా తరఫున ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్సు సూపరింటెండెంట్ ఇంజనీర్లు షేక్ జాకీర్ హుస్సేన్, సీహెచ్ హనుమ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.జైపాల్, ఏఈఈ సీహెచ్ సురేశ్ పాల్గొనగా, ఒడిశా తరఫున బలిమెల హైడ్రో కార్పొరేషన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఓంప్రకాశ్‌నాయక్, డిప్యూటీ మేనేజర్ కె.బెహరా, అసిస్టెంట్ మేనేజర్ సుబదీప్ పండా, పొట్టేరు ఇరిగేషన్ ప్రాజెక్టు చీఫ్ కనస్ట్రక్షన్ ఇంజనీర్ కృపాకుమార్ పాత్రో, చిత్రకొండ ఎర్త్ డ్యాం డివిజన్ ఎస్ఈ సనోజ్ సాహు, ఏఈఈ లుదిలీప్‌కుమార్, గడాదర్ ప్రధాన్, కేసీ ఫణి పాల్గొన్నారు.

## మత్స్యగెడ్డలో పడి ఒకరి మృతి

**పెదబయలు, పతాకం న్యూస్:** మండలంలోని మత్స్యగెడ్డలో ప్రమాదవశాత్తూ ఒక వ్యక్తి బుధవారం మృతి చెందాడు. దీనికి సంబంధిం చి అతని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అరడకోట పంచాయతీ కేంద్రానికి చెందిన టి.వెంకట రమణ(35) గతంలో ఆటో డ్రైవర్‌గా జీవనం సాగించాడు. అనారోగ్యం కారణంగా ఆపరేషన్ జరగడం తో మతిస్థిమితం కోల్పోయాడు. ఉదయం అతను కాలకృత్యా లు తీర్చుకోవడానికి మత్స్య గెడ్డ వద్దకు వెళ్లాడు. అయితే ప్రమాదవశాత్తూ ఊబిలో చిక్కుకుపోయి బయటకు రాలేక మృతి చెందాడు. ఎంతసేపటికి వెంకటరమణ ఇంటికి రాకపోవడంతో అతని భార్య రత్నకుమారి చుట్టుపక్కల వారిని వాకబు చేసింది. అతను గెడ్డలో చిక్కుకుపోయినట్టు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.

# సమన్వయంతో అటవీ భూ సమస్యల పరిష్కారం



**పాడేరు, పతాకం న్యూస్:** జిల్లాలో అటవీ భూ సమస్యలను ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పరిష్కరించి ప్రజలకు న్యాయం చేయాలని కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ ఆదేశించారు. జిల్లాలో కొయ్యూరు, జీకేవీధి, చింతపల్లి మండలాలకు సంబంధించి అటవీ భూ సమస్యలపై కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెవెన్యూ సదస్సుల్లో చింతపల్లి, జీకేవీధి, కొయ్యూరు మండలాల్లోని ప్రజల నుంచి స్వీకరించిన వినతుల్లో ఇంకా అధిక సంఖ్యలో వినతులు పరిష్కారానికి నోచుకోలేదన్నారు. వాటిని పరిష్కరించేందుకు అధికారులు వంద రోజుల ప్రణాళికను రూపొందించుకుని అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఆ మూడు మండలాల్లో భూముల మ్యుటేషన్‌కు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలన్నారు. చింతపల్లి, జీకేవీధి మండలాల్లో రెవెన్యూ, ఫారెస్ట్ భూములకు సంబంధించిన అంశాలపై ఇరు శాఖలు సమన్వయంతో క్షేత్ర పరిశీలనలు చేపట్టి మూడు రోజుల్లో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. సరిహద్దులు, భూ రికార్డులు వివాదాస్పదంగా ఉన్నా పక్కాగా గుర్తించి సరిచేయాలన్నారు. పాత పట్టాలను, ప్రస్తుత రికార్డులను పరిశీలించి అర్హులైన గిరిజనులకు భూమి హక్కులు కల్పించాలని అధికారులకు సూచించారు. అటవీ హక్కుల చట్టంలో భాగంగా చింతపల్లి, జీకేవీధి, కొయ్యూరు మండలాల్లో గుర్తించిన 110 గ్రామాలకు సామాజిక అటవీ హక్కులను కల్పించేందుకు రెవెన్యూ, అటవీ శాఖాధికారులు చర్యలు చేపట్టాలన్నారు.

## టెన్త్ పరీక్షల్లో శతశాతం ఫలితాలు సాధించాలి



**ఇచ్ఛాపురం, పతాకం న్యూస్:** పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో శతశాతం ఉత్తీ ర్ణత సాధించాలని, ఈ దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో కె.రవిబాబు అన్నారు. మండల పరిధి కొళిగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాల, హరిపురం ఎంపీయూపీఎస్, బిర్లంగి ఎంపీపీ ఎస్, మున్సిపల్ బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీ లించారు. 100 రోజుల ప్రణాళిక, 30 రోజుల వెనుకబడిన విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను తెలుసుకున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యా యులతో సమీక్ష సమావేశం నిర్వ హించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. బాలుర వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్ర మంలో ఎంఈవోలు కె.అప్పారావు, ఎస్.విశ్వ నాథం, వార్డెన్ కాంతారావు పాల్గొన్నారు టెన్త్‌లో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు డీఈవో రవిబాబు అన్నారు. ఎంఎస్‌పల్లి బీసీ హాస్టల్‌ను సందర్శించారు. అనం తరం విద్యార్థులతో మాట్లాడి సమయాన్ని వృథా చేయవద్దన్నారు. ప్రణాళికాబద్ధంగా చదివి మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఎంఈవోలు శివరాం, ప్రసాద్, చిట్టిబాబు పాల్గొన్నారు.

## గంజాయిని తరలిస్తున్న నలుగురు వ్యక్తులు అరెస్టు



**నరసన్నపేట, పతాకం న్యూస్:** ఒడిశా రాష్ట్రం నుంచి ఉత్తరప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు బ్యాగులతో గంజాయిని తరలిస్తున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 24 కేజీల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను నరసన్నపేట సర్కిల్ కార్యాలయంలో సీఐ మరడాన శ్రీనివాసరావు, ఎస్ఐ బలివాడ గణేష్ విలేకరులకు వెల్లడించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం భాగపట్ జిల్లా తాండ గ్రామానికి చెందిన దుప్పట్ల వ్యాపారం చేసే ఆసిబ్‌ఖాన్, ఆదిల్ ఖాన్ ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లాకు చెందిన రామసాగారియా అనే వ్యక్తి నుంచి 12 కేజీల గంజాయిని కోనుగోలు చేశారు. వివిధ వాహనాలు మారుతూ హైదరాబాద్ మీదుగా ఉత్తరప్రదేశ్‌కు వెళ్లేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ మేరకు కోరాపుట్ నుంచి ఓ వాహనంలో వెళుతుండగా మంగళవారం సాయంత్రం మడపాం టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులను వారు చూశారు. దీంతో వాహనం దిగి పారిపోయేందుకు ప్రయత్నించగా పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద ఉన్న బ్యాగ్‌లను తనిఖీ చేయగా 12 కేజీల గంజాయి ప్యాకెట్లు దొరికాయి. అదే విధంగా ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లాకు చెందిన ఇస్సాకో రైతా, సాగర్ పహాన్ అనే ఇద్దరు వ్యక్తులు 12కేజీల గంజాయి ప్యాకెట్లను హైదరాబాద్‌లో ఉంటున్న స్నేహితునికి ఇచ్చేందుకు లారీలో బయలుదేరారు. మడపాం టోల్‌ప్లాజా వద్ద వాహనాలు తనిఖీలు చేస్తున్న పోలీసులను చూసి వారు లారీ దిగిపోయారు. ఒక ప్రైవేటు ట్రావెల్ బస్సు ఎక్కేందుకు ప్రయత్నించగా ఎస్ఐ గణేష్ తన బృందంతో పట్టుకున్నారు. ఈ రెండు కేసుల్లో 24 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు సీఐ తెలిపారు.

## శతశాతం ఫలితాల సాధనే ధ్యేయం



**విజయనగరం, పతాకం న్యూస్:** జిల్లాలో అన్ని జడ్పీ పాఠశాలల్లో పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు శతశాతం ఉతీర్ణత సాధించే ధ్యేయంగా ఉపాధ్యాయులు పని చేయాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారి కేవీ రమణ తెలిపారు. మండలంలోని వావిలపాడు, నీలకంఠరాజపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు నాగభూషణరావు, బాలభాస్కరరావు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు శ్రీనివాసరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

## స్కూల్ బస్సు బోల్తా

**బొబ్బిలి, పతాకం న్యూస్:** అలజంగి గ్రామ సమీపంలో జంక్షన్ వద్ద బొబ్బిలి-రాజాం వెళ్లే రహదారిలో సాయంత్రం ప్రయివేటు స్కూల్ బస్సు బోల్తా పడింది. ఈ ఘటనలో 22 మంది విద్యార్థులకు గాయాలయ్యాయు. వీరంతా బొబ్బిలి పట్టణంలోని సెవెంత్ డే ప్రయివేటు పాఠశాలలో వివిధ తరగతులు చదువుతున్నారు. కాడాడ గ్రామం వద్ద ఉన్న సన్‌రైజ్ చిల్డ్రన్ హోమ్ (స్వచ్ఛంద సేవాసంస్థ) సంరక్షణలో ఉంటున్న ఈ విద్యార్థులంతా ప్రతిరోజులాగే బుధవారం ఉదయం పాఠశాలకు వెళ్లారు. సాయంత్రం పాఠశాల పూర్తయిన అనంతరం 34 మంది విద్యార్థులు బస్సులో కారాడ సన్‌రైజ్ హోమ్‌కు బయలుదేరారు. ఎదురుగా వస్తున్న వాహనాన్ని డ్రైవర్ తప్పించబోయాడు. ఆ క్రమంలో బస్సు అదుపుతప్పి పంటపొలాల్లోకి బోల్తా పడింది. ఆ వైపుగా వెళ్తున్న వారంతా వచ్చి సహకారం అందించారు.

## మహాశివరాత్రి ఉత్సవాలకు పక్కాగా ఏర్పాట్లు చేయాలి



**జలుమూరు, పతాకం న్యూస్:** శ్రీముఖలింగంలో ఈనెల 15 నుంచి 18వ తేదీ వరకు నాలుగు రోజులపాటు నిర్వహించనున్న మహాశివరాత్రి ఉత్సవాల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పక్కా ఏర్పాట్లు చేయాలని అసిస్టెంట్ కలెక్టర్ డి.పృథ్వీరాజ్‌కుమార్, ఆర్డీవో కె.సాయి ప్రత్యూష ఆదేశించారు. శ్రీముఖలింగేశ్వరాలయంలో చేపడుతున్న ఉత్సవాల ఏర్పాట్లను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆలయ దక్షిణ ద్వారం వద్ద ప్రసాదాల కౌంటరు ఏర్పాటు చేయడం వల్ల భక్తులు ఇబ్బంది పడుతున్నట్టు గుర్తించామని, దీనిని ప్రధాన ఆలయం వెనుక భాగంలోని రోడ్డుపై మూడు కౌం టర్లు ఏర్పాటు చేయాలని ఆదేశిం చినట్టు తెలిపారు. ప్రసాదం విక్ర యాలపై పర్యవేక్షణకు ఒక ఈవో, ప్రసాదం తయారీకి ఒక ఈవో, పారిశుధ్యం పర్యవేక్షణకు ఒక ఈవోని నియమించాలన్నారు. వంశధార నదిలో చక్రతీర్థ స్నానాలు ఆచరించే మిరియాపల్లి రేవును పరిశీలించారు. తహసీల్దార్ జె.రామారావు, ఈవో ఏడుకొండలు, ఆర్ఐ జగదీష్, సర్పంచ్ టి.సతీష్‌కుమార్, అర్చకులు పాల్గొన్నారు.

## రైతుల్లో మరింత చైతన్యం కలిగించండి



**సాలూరు, పతాకం న్యూస్:** రైతులు అధిక దిగుబడులు సాధిం చేందుకు వారిలో మరింత చైతన్యం కలిగిం చాలని కలెక్టర్ ఎన్.ప్రభాకర్ రెడ్డి వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. సాయంత్రం జనవరివలస వద్ద వ్యవసాయాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి రైతు వ్యవసాయం పండుగ లా భావించాలన్నారు. ఆహార ఉత్పత్తులను అధికంగా సాధించేలా వారిని ప్రోత్సహించాల న్నారు. సమాజానికి ఆహార భద్రత చేకూరేలా వ్యవసాయాధికారులు, ఉద్యానవన శాఖ అధికారులు శ్రద్ధ తీసుకోవాల న్నారు. రైతులు వాణిజ్య పంటలు సైతం విరివిగా సాగు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు ఆకళింపు చేసుకునేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలన్నారు. యూరియా, నానో యూరి యాల వినియోగం ప్రయో జనాలను రైతులకు పూర్తిస్థాయిలో వివరిం చాలన్నారు. వ్యవసాయంలో జిల్లా ప్రథమస్థానం సాధించేలా అధికారులు కృత నిశ్చయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.నీలకంఠరావు, ఎంపీడీవో గొల్లపల్లి పార్వతి తదితరులు పాల్గొన్నారు.

## నీటిఎద్దడి నివారణకు ప్రణాళిక



**విజయనగరం, పతాకం న్యూస్:** రానున్న వేసవిలో నీటి ఎద్దడి నివారణకు ముందస్తు ప్రణాళిక చేపడతామని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి తెలిపారు. విజయనగరంలో ఇంజనీరింగ్ అధికారులతో సమీ క్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిలో ఇబ్బంది తలెత్తకుండా చేపట్టాల్సిన ప్రణాళికను పకడ్బందీగా చేపడతామని తెలిపారు. సమావేశంలో ఇంజనీరింగ్ ఈఈ ప్రసాద్, శ్రీనివాసరావు, ప్రజారోగ్యసాంకేతికశాఖ డీఈ ఈశ్వరరావు, జ్యోతి పాల్గొన్నారు.

## ఆగిపోయిన లారీ.. తలెత్తిన ట్రాఫిక్ ఇబ్బందులు




**పలాస, పతాకం న్యూస్:** టోల్‌గేటు ఫీజ్ నుంచి తప్పించుకో వడానికి వచ్చిన ఓ లారీ పాతజాతీయ రహదారి కాశీబుగ్గ రైల్వే ఎల్‌సీ గేటు వద్ద నిలిచిపోయిన ఘటన ఉదయం చోటుచేసుకుంది. దీనిని కదిలించడానికి స్థానికులు విశ్వప్రయత్నాలు చేశారు. సుమారు గంటపాటు కష్టపడి అతికష్టంపై గేటును దాటించారు. భారీ లోడ్‌తో ఇచ్ఛాపురం వైపు వెళ్లడానికి లక్ష్మీపురం వద్ద టోల్‌గేటును తప్పించు కోవచ్చని ఓ లారీ కాశీబుగ్గ పాత జాతీయరహదారి మీదుగా ఉదయం 6 గం టల సమయంలో వచ్చింది. రైల్వేగేటు దాటుతున్న సమయంలో లారీ ఒక్కసా రిగా మొరాయించింది. డ్రైవరు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో రైలు గేటు వేయడానికి కూడా వీలులేకపోయింది. స్థానికులు ఎంతో కష్టపడి లారీని ముందుకు తోశారు. కాగా లక్ష్మీపురం టోల్‌గేట్‌ను తప్పిం చుకోవడానికి ప్రతిరోజూ చాలా లారీలు కాశీబుగ్గ పాతజాతీయ రహదారి మీదుగా వస్తున్నాయి. నిత్యమూ రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ముఖ్యమైన లారీలు తప్పా ఇతర లారీలు పట్టణంలోకి రాకుండా పోలీసుల ఆజ్ఞలు ఉన్నా.. అమలవుతున్న పరిస్థితి లేకపోవడం విశేషం.

## పలు వసతి గృహాలను సందర్శించిన హరిబాబు




**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** నగరంలోని పలు వసతి గృహాలను న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు సందర్శించారు. కలెక్టరేట్ రోడ్డులోని స్త్రీ సదనం, ఇలిసిపురం ఖ్యాతి ఫౌండేషన్ సంస్థలను సందర్శించి వాటిలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులతో మాట్లాడి వారి స్థితిగతులను అడిగి తెలుసు కున్నారు. ఆహారం, ఇతర సదుపాయాలపై ఆరా తీశారు. వారికి కావల్సిన న్యాయ సహాయం అందించేందుకు ఎల్లవేళలా సంస్థ అందుబాటులో ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యాయవాధి గేదెల ఇందిరా ప్రసాద్, ఎస్.ధనలక్ష్మి, ఆర్.శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలకు రూ.కోటి విరాళం



**సంతబొమ్మాళి, పతాకం న్యూస్:** మండలంలోని దండుగోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వపు విద్యారి డాక్టర్ లమ్మత విశ్వనాథం తన దాతృత్వం చాటుకున్నారు. తను చదువుకున్న పాఠశాలకు రూ.కోటి విరాళాన్ని ప్రకటించారు. ఈ పాఠశాలలో 1966లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు 60 ఏళ్ల తరువాత అపూర్వకలయిక కార్యక్రమం నిర్వహించారు. ఈ పాఠశాలలో విద్యనభ్యసించిన డాక్టర్ విశ్వనాథం (ఎండీ, ఎఫ్ఏసీసీ) అమెరికాలో స్థిరపడ్డారు. ఆయన ఆత్మకథను 'నా జీవన యానం కాళీపురంలో మొదలై..' అనే పేరుతో పుస్తకాన్ని ఇదే పాఠశాలలో ఆయనతో చదువుకున్న చింతాడ కృష్ణారావు రచించారు. ఈ పుస్తక ఆవిష్కరణ కార్యక్రమాన్ని కోత మహాలక్ష్మి అప్పన్న మెమోరియల్ సర్వీసు ఆర్గనైజేషన్ సంస్థ నిర్వహించగా, పుస్తకాన్ని ఎల్.ఎల్. నాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ విశ్వనాథం మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధికి తన వంతుగా ఒక కోటి రూపాయలు విరాళం ప్రకటిస్తున్నానని, ఈ మొత్తాన్ని ఆడిటోరియం నిర్మాణానికి వెచ్చించాలని కోరారు. దీంతో ఉపాధ్యాయులు, గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కోత చిన్నబాబు, కార్యదర్శి కోత మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్-1పై హైకోర్టు కీలక తీర్పు.. అక్రమాలను నిగ్గు తేల్చేందుకు సిట్ ఏర్పాటు



**అమరావతి, పతాకం న్యూస్:** గ్రూప్-1 ప్రధాన పరీక్షా పత్రాల మూల్యాంకనంలో అక్రమాలపై హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. జవాబుపత్రాల మూల్యాంకనంలో జరిగిన అక్రమాలను నిగ్గు తేల్చేందుకు సిట్ ఏర్పాటు చేయాలని న్యాయస్థానం ఆదేశించింది. అడిషనల్ డీజీ స్థాయి అధికారితో సిట్ ఏర్పాటు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. రాష్ట్రం వెలుపల ఉన్న ఫోరెన్సిక్ నిపుణుల సహాయం తీసుకోవాలని స్పష్టం చేసింది. మార్చి 16 లోపు నివేదిక సమర్పించాలని ఆదేశించింది. గ్రూప్-1 పరీక్షా పత్రాల మూల్యాంకనంపై సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పుపై దాఖలైన అప్పీల్ పిటీషన్లపై విచారణ జరిపిన న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీపీఎస్సీ గ్రూప్-1 జవాబు పత్రాల మూల్యాంకనంలో అక్రమాలపై హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. మూల్యాంకనంలో అక్రమాలను తేల్చేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. అదనపు డీజీ స్థాయి అధికారి పర్యవేక్షణలో సిట్ బృందం ఏర్పాటు చేయాలని న్యాయస్థానం పేర్కొంది. దర్యాప్తు జరిపేటప్పుడు రాష్ట్రం వెలుపల ఉన్న ఫోరెన్సిక్ నిపుణుల సహాయం తీసుకోవాలని ఆదేశాల్లో స్పష్టం చేసింది. విజయవాడలో జరిగిన మూల్యాంకనం సమయంలో వినియోగించిన బార్ కోడ్?లు, అసలు ఓఎంఆర్ షీట్లు, వాటి వివరాలు ఒకదానితో ఒకటి సరిపోలుతున్నాయో? లేదో అనే విషయాన్ని విశ్లేషించాలని స్పష్టం చేసింది. ఎంపికై ఉద్యోగాలు చేస్తున్న అభ్యర్థులు దర్యాప్తును ప్రభావితం చేసే అవకాశం ఉన్నందున వారందరినీ ప్రాధాన్యం లేని పోస్టులకు బదిలీ చేయాలని సీఎస్‌ను ఆదేశించింది. ఈ వ్యవహారంలో తీసుకున్న చర్యలపై నివేదికను కోర్టుకు సమర్పించాలని సీఎస్‌కు స్పష్టం చేసింది. మార్చి 16 లోపు గ్రూప్-1 జవాబు పత్రాల మూల్యాంకనంలో అక్రమాలపై సిట్ నివేదికను కోర్టుకు సమర్పించాలని సూచించింది. 2018లో అప్పటి ప్రభుత్వం 169 గ్రూప్-1 పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వగా 2019లో పరీక్షలను నిర్వహించారు. 2021లో పరీక్షా ఫలితాలను విడుదల చేశారు. జవాబుపత్రాలను డిజిటల్ వాల్యూయేషన్ చేశారని నోటిఫికేషన్ ప్రకారం మాన్యువల్‌గా మూల్యాంకనం చేయించాలని కోరుతూ పలువురు అభ్యర్థులు 2021లో హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. పిటీషన్?పై విచారించిన న్యాయస్థానం మాన్యువల్‌గా మూల్యాంకనం చేయాలని ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు ఆదేశాలతో ఏపీపీఎస్సీ 2022లో మాన్యువల్?గా మూల్యాంకనం జరిపిన తర్వాత ఫలితాలను విడుదల చేసింది. గ్రూప్-1 ప్రధాన పరీక్షా జవాబు పత్రాలను హ్యాయ్ ల్యాండ్?లో ఒకసారి, వేరే ప్రాంతంలో మరోసారి మూల్యాంకనం జరిపారని దీనివల్ల తాము అనర్హులు అయ్యామని పలువురు అభ్యర్థులు 2022లో హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై హైకోర్టు సింగిల్ జడ్జి విచారణ జరిపింది. ఈ దశలో ఇంటర్వ్యూలను నిలువరించలేమన్న న్యాయస్థానం ఇంటర్వ్యూ నిర్వహించేందుకు అనుమతినిచ్చింది. ఇంటర్వ్యూలో సెలక్ట్ అయిన వారిని ఉద్యోగాల్లో నియమించాలని కోర్టు సూచించింది. నియామకాలు జరిపే సమయంలో అభ్యర్థులు కోర్టు తుది తీర్పుకు లోబడే ఉండాలంటూ అండర్ టేకింగ్ లెటర్ తీసుకోవాలని ఏపీపీఎస్సీని ఆదేశించింది. గ్రూప్-1 ప్రధాన పరీక్ష జవాబుపత్రాల మాన్యువల్ మూల్యాకనంలో అక్రమాలు చోటు చేసుకున్నాయన్న కారణంతో పరీక్షను రద్దు చేసి, తాజాగా నిర్వహించాలని హైకోర్టు సింగిల్ జడ్జి 2024 మార్చి 13న కీలక తీర్పు ఇచ్చారు. ఈ తీర్పును సవాలు చేస్తూ ఏపీపీఎస్సీ, ఉద్యోగాలు పొందిన వారు, పొందని వారు ధర్మాసనం ముందు వేర్వేరుగా అప్పీళ్లు వేశారు. 'అప్పీళ్లలో' ఉద్యోగాలకు ఎంపికన అభ్యర్థులు కొందరు దాఖలు చేసిన 'అనుబంధ పిటిషన్లపై' హైకోర్టులో వాదనలు ముగిశాయి. మాన్యువల్ మూల్యాంకనంలో జరిగిన అక్రమాలను వెలికితీసేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేయాలని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది.

## రాష్ట్ర వ్యాప్తంగా కదం తొక్కిన కార్మిక లోకం






**అమరావతి, పతాకం న్యూస్:** లేబర్ కోడ్‌లను రద్దు చేయాలంటూ కార్మిక లోకం కదం తొక్కింది. దేశంలో పలు కార్మిక సంఘాలకు నష్టం చేకూర్చే లేబర్ కోడ్ లు రద్దు చేయాలంటూ వివిధ కార్మిక సంఘాలు కదం తొక్కాయి. రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో కార్మికులు పెద్ద ఎత్తున సమ్మెలో భాగస్వామ్యమయ్యారు. కేంద్రం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, కేంద్ర కార్మిక వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఆళ్లగడ్డలో గురువారం చేపట్టిన సార్వత్రిక సమ్మె విజయవంతం అయింది. సిపిఎం, సిపిఐ పార్టీలు మరియు సిఐటియు, ఏఐటీయూసీ కార్మిక సంఘాలు, రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాలు, ఏఐవైఎఫ్ యువజన సంఘం, ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్, సర్వ శిక్ష అభియాన్, కస్తూరిబా టీచర్ల విభాగం, మున్సిపల్, గ్రామ పంచాయతీ వర్కర్ల ఆధ్వర్యంలో ఆళ్లగడ్డలోని ఎమ్మార్వో కార్యాలయం నుండి నాలుగు రోడ్ల కూడలి వరకు సుమారు 300 మంది కార్మికులు కేంద్ర ప్రభుత్వం అనుసరించే ప్రజా వ్యతిరేక విధానాలు నివసిస్తూ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాముడు, అంగన్వాడి యూనియన్ నాయకురాలు పెద్దక్క, శైలజ, వసుంధర, సీతామహాలక్ష్మి, ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా సహా కార్యదర్శి కృపావతి, జయలక్ష్మి, చిన్నమ్మ, సర్వ శిక్ష అభియాన్ కస్తూరిబా నాయకురాలు హుసేన్ బి, మల్లికార్జున, షబ్బీర్, రైతు సంఘం నాయకులు నరసింహుడు, నరసయ్య, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు లతీఫ్, హర్ష, సంతోష్ నాయక్ మున్సిపల్ పంచాయతీ కార్మికుల నాయకులు వెంకటయ్య, సాల్మన్, రాజు, వెంకటపతి , వసంత తదితరులు పాల్గొన్నారు.

# వారం రోజులుగా ఫ్రీజర్‌లో 'మాంసాహారం'..

## అధికారుల తనిఖీల్లో భారీగా నాన్‌వెజ్ సీజ్



**గుంటూరు, పతాకం న్యూస్:** గుంటూరు నగరంలో ఉన్న పలు రెస్టారెంట్లు, బిర్యానీ సెంటర్లు, బేకరీలు, స్వీట్స్ దుకాణాల్లో ఆహార భద్రత నియంత్రణశాఖ, తూనికలు-కొలతలశాఖ అధికారులు ఆకస్మిక దాడులు చేశారు. పది బృందాలుగా ఏర్పడి అరండల్‌పేట, కింగ్స్ హోటల్‌సెంటర్, లాలాపేట, బ్రాడీపేట, లక్ష్మీపురం, బృందావన్ గార్డెన్స్ సెంటర్, నగరాలు ప్రాంతాల్లో ఉన్న పలు హోటళ్లలో తనిఖీలు నిర్వహించారు. తనిఖీలు చేస్తున్న విషయం తెలిసిన పలువురు హోటళ్ల నిర్వాహకులు రెస్టారెంట్లను సైతం మూసేశారు. ఈ తనిఖీల్లో భాగంగా మొత్తం 16 నమూనాలు సేకరించామని రాష్ట్ర జాయింట్ ఫుడ్ కంట్రోలర్ ఇన్‌ఛార్జి నూతలపాటి పూర్ణచంద్రరావు తెలిపారు. నగరంలోని లక్ష్మీపురం మెయిన్‌రోడ్డులో ఉన్న ఓ ప్రముఖ రెస్టారెంట్‌లో దాదాపు 60 కిలోల చికెన్‌తో పాటు మటన్‌ను సీజ్ చేశారు. నిర్వహకులు సుమారు వారం రోజులుగా చికెన్, మటన్‌ను ఫ్రిజ్‌లో నిల్వ ఉంచినట్టు అధికారులు గుర్తించారు. ఇందులో ఎక్కువ శాతం ఉడకబెట్టిందేనని, వండిన తర్వాత దాన్ని ఫ్రీజ్‌లో నిల్వ చేయటం చట్ట విరుద్ధమని ఫుడ్ కంట్రోలర్ పూర్ణచంద్రరావు తెలిపారు. కస్టమర్లకు దాన్ని వేడి చేసి ఇస్తున్నట్లు కూడా అధికారులు గుర్తించారు. ఇలా చేయడం వల్ల ఆ మాంసంపై ఫంగస్ ఏర్పడి, అది వ్యాపించి తిన్నవారు డయేరియా బారిన పడే ప్రమాదం ఉందని పూర్ణచంద్రరావు చెప్పారు.

ఆ ప్రాంతంలో ఉన్న ఒక స్వీట్ షాపు నిర్వాహకుడు సుమారు 13 కిలోల పూర్ణాల పిండిని ఫ్రిజ్‌లో నిల్వ ఉంచారు. అపరిశుభ్ర వాతావరణంలో స్వీట్లను తయారు చేస్తున్న వ్యాపారులకు కూడా అధికారులు నోటీసులిచ్చారు. రెస్టారెంట్లలో వండే ప్రతి వంటకంలో మోతాదుకు మించి రంగులు కలిపినట్టు తనిఖీలో తేలింది. వంటగదిలో వాడుతున్న నూనెను పరిశీలించగా అది పూర్తిగా రంగు మారిపోయినట్లు గుర్తించారు.

ఆహార నమూనాలను ల్యాబ్ పరీక్షకు పంపుతామని, నివేదిక వచ్చాక బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర జాయింట్ ఫుడ్ కంట్రోలర్ ఇన్‌ఛార్జి పూర్ణచంద్రరావు తెలిపారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు అమ్మిన వారిపై చర్యలు తీసుకుంటామని తూనికలు కొలతలు శాఖ సంయుక్త కమిషనర్ మాధురి తెలిపారు. ఎటువంటి నాణ్యత లేని, కల్తీ ఆహార పదార్థాలు మార్కెట్‌ల్లో విక్రయిస్తున్నట్టు గుర్తిస్తే 94403 79755 ఫోన్ నంబరుకు సమాచారం అందించాలి. గుంటూరు నగరంలో చేసిన తనిఖీల్లో అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్లు బి.శ్రీనివాస్‌తో పాటు జి.వెంకటేశ్వరరావు, తూనికలు-కొలతలశాఖ జాయింట్ కంట్రోలర్ ఎంఎన్ఎస్ మాధురి, డిప్యూటీ కంట్రోలర్ డీవీ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

"లక్ష్మీపురం మెయిన్‌రోడ్డులో ఉన్న ఓ రెస్టారెంట్‌లో ఉన్న దాదాపు 60 కిలోల చికెన్‌తో పాటు మటన్‌ను సీజ్ చేశాం. సుమారు వారం రోజులుగా చికెన్, మటన్‌ను ఫ్రిజ్‌లో నిల్వ ఉంచినట్టు గుర్తించాం. ఇందులో ఎక్కువ శాతం ఉడకబెట్టిందే ఉంది. కస్టమర్లకు దాన్ని వేడి చేసి ఇస్తున్నట్లు కూడా గుర్తించాం. ఇలా చేయడం వల్ల ఆ మాంసంపై ఫంగస్ ఏర్పడి, అది వ్యాపించి తిన్నవారు డయేరియా బారిన పడే ప్రమాదం ఉంది. ఆహార నమూనాలను ల్యాబ్ పరీక్షకు పంపుతాము, నివేదిక వచ్చాక బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం." - రాష్ట్ర జాయింట్ ఫుడ్ కంట్రోలర్ ఇన్‌ఛార్జి నూతలపాటి పూర్ణచంద్రరావు తెలియజేశారు.

# వ్యవసాయంలో పెరుగుతున్న డ్రోన్ల వినియోగం!





**అమరావతి, పతాకం న్యూస్:** ఓలా, ర్యాపిడో, ఉబర్ మాదిరి డ్రోన్లను సైతం ఫోన్ ద్వారా బుక్ చేసుకునే సౌకర్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. డ్రోన్ మార్ట్ పేరిట ప్రత్యేక మొబైల్ యాప్‌ను రూపొందించింది. కూలీల ఖర్చు తగ్గించే క్రమంలో సాగుకు అనుకూలంగా డ్రోన్ సాంకేతికత జత చేస్తోంది. రాష్ట్రమంతటా ఎప్పుడైనా, ఎక్కడైనా డ్రోన్ సేవలు పొందవచ్చు. రాబోయే ఖరీఫ్ నాటికి డ్రోన్ల వినియోగం మరింత పెంచేలా ప్రచార కార్యక్రమాన్ని కూడా చేపట్టారు. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది. అయితే రైతులందరూ సొంతగా డ్రోన్లు కొనుగోలు చేయలేరు. దీంతో కొందరు యువకులు డ్రోన్లను కొనుగోలు చేసి వాటి ద్వారా స్వయం ఉపాధి పొందుతున్నారు. అలాంటి వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా రాయితీపై డ్రోన్లు అందజేస్తున్నాయి. అయితే ఈ డ్రోన్లను సమర్థంగా వినియోగించటంతో పాటు రైతులకు సేవలందించేలా చేయటంలో కొంత అంతరాయం ఉంది.

డ్రోన్ ఎవరి వద్ద ఉందనేది రైతులకు తెలియదు. ఏ రైతుకు డ్రోన్ అవసరం ఉందో ఆపరేటర్‌కు తెలియదు. దీంతో క్షేత్రస్థాయిలో డ్రోన్ల వినియోగం ఆశించిన స్థాయిలో విస్తరించటం లేదు. ఈ అంతరాయాన్ని పూడ్చేందుకు రాష్ట్ర వ్యవసాయశాఖ సాంకేతికత సాయం తీసుకుంది. డ్రోన్ ఆపరేటర్ల వివరాలతో ఓ యాప్ రూపొందించింది.

పురుగుమందు పిచికారి, విత్తనాలు చల్లేందుకు డ్రోన్లు కావాల్సిన రైతులు యాప్‌లో బుక్ చేసుకోవచ్చు. ఈ సేవలకు డ్రోన్ ఉబరైజేషన్ అని పేరు పెట్టారు. మనం ఒకచోట నుంచి మరోచోటికి వెళ్లేందుకు ఆటో, కారును ఓలా, ఉబర్‌లో బుక్ చేసుకున్నట్లే డ్రోన్ అవసరమైన వారు ఈ యాప్‌లో బుక్ చేసుకునే అవకాశం కల్పించారు. డ్రోన్ నిర్వాహకులకు రైతులను అనుసంధానించటం ద్వారా ఇరువురికీ మేలు జరగనుంది. డ్రోన్ నిర్వాహకులకు అదనపు బాడుగలు వస్తాయి. సొంత ఊరిలోనే కాకుండా సమీప గ్రామాల నుంచీ ఆర్డర్లు వస్తాయి. వారు పెట్టిన పెట్టుబడికి, ప్రభుత్వం ఇచ్చిన ప్రోత్సాహకాలకు తగ్గట్లుగా డ్రోన్ సేవలు రైతులకు అందుబాటులో ఉంటాయి.

దీనికి గాను రైతులు ప్లే స్టోర్ నుంచి డ్రోన్ మార్ట్ యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవాలి. ఆ తర్వాత తమ వివరాలు అందులో నమోదు చేసి రిజిస్టర్ కావాలి. ఎప్పుడు డ్రోన్ సేవలు అవసరమైనా యాప్ ద్వారా బుక్ చేసుకోవచ్చని అధికారులు చెబ్తున్నారు. డ్రోన్లు మాత్రమే కాకుండా మరికొన్ని వ్యవసాయ యంత్ర పరికరాలను కూడా యాప్ ద్వారా బుక్ చేసుకునే వెసులుబాటు కల్పించారు. త్వరలోనే ఇవన్నీ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్నాయి.

'డ్రోన్లు సేవలు రైతులకు అందుబాటులో ఉంటాయి. డ్రోన్ ఉబరైజేషన్‌లో వీటి సేవలనూ పొందవచ్చు. డ్రోన్ పోర్టల్ ఫార్మలైజేషన్ చేసుకోవాలి. ఆ తర్వాత వారి వివరాలు నమోదు చేయాలి. డ్రోన్లు మాత్రమే కాకుండా వ్యవసాయ యంత్ర పరికారాలనూ బుక్ చేసుకోవచ్చు. వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకురాలు ఎం.పద్మావతి తెలిపారు.

పురుగు మందుల పిచికారీకి డ్రోన్లను ఎక్కువగా వినియోగిస్తున్నారు. వరిసాగు చేసే రైతులు ఆ బురదలో దిగి మందులు చల్లలేకపోతున్నారు. అలాగే ఎత్తైన పంటలకు స్ప్రేయర్లతో పిచికారిలో ఇబ్బందులు వస్తున్నాయి. ఇలాంటి సమయాల్లో డ్రోన్లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. డ్రోన్ల తయారీ కంపెనీలు పెరగటంతో వాటి ధరలు కూడా కొంతమేర దిగి వచ్చాయి. రైతు ఉత్పత్తి సంఘాలకు ప్రభుత్వమే రాయితీపై డ్రోన్లు ఇస్తోంది. వీటన్నింటి దృష్ట్యా భవిష్యత్తులో డ్రోన్ల వినియోగం మరింతగా పెరగనుంది.

# హైబీపీతో గుండెకు సమస్యలు?



వయసు పైబడిన వారితో పాటు యువతలో కూడా ఎక్కువగా వస్తున్న అనారోగ్య సమస్యల్లో రక్తపోటు ఒకటి. ఒత్తిడి, ఆందోళన, వ్యాయామం చేయకపోవడం, ఉప్పు కలిగిన ఆహారాలను , ప్రాసెస్ చేసిన ఆహారాలను ఎక్కువగా తీసుకోవడం వంటి వివిధ కారణాల వల్ల రక్తపోటు బారిన పడుతున్నారు. అధిక రక్తపోటు ఒక దీర్ఘకాలిక అనారోగ్య సమస్య. రక్తపోటు కారణంగా ధమనులు సంకోచానికి గురి అవుతాయి. దీంతో శరీరమంతటికీ రక్తాన్ని సరఫరా చేయడం గుండెకు కష్టమవుతుంది. ఈ సమస్యకు మందులు ఉన్నప్పటికీ వీటిని ఎక్కువ కాలం పాటు వాడాల్సి ఉంటుంది. రక్తపోటు మందులు వాడడం వల్ల రక్తపోటు స్థాయిలు అదుపులో ఉన్నప్పటికీ గుండె పోటు, స్ట్రోక్స్ వంటి గుండె సమస్యలు వచ్చే ప్రమాదాన్ని తగ్గించడంలో ఇవి విఫలమవుతున్నాయని వైద్యులు చెబుతున్నారు.

అంతేకాకుండా మందులు వాడడా నికంటే ముందు అధిక రక్తపోటుకు గల కారణాలను తెలుసుకుని వాటిని ఆపడం మంచిదని సలహా ఇస్తున్నారు. రక్తపోటు సమస్య ఒక హెచ్చరిక లాటిందని ఇది మన శరీరంలో ఒత్తిడిని, వాపును, రక్తనాళాలు పనిచేయకపోవడాన్ని, పోషకాల లోపాన్ని, శరీరంలో పేరుకుపోయిన విషాలను సూచిస్తుందని వైద్యులు తెలియజేస్తున్నారు. ఇక రక్తపోటును మిల్లీమీటర్ల పాదరసం( ఎఎ నస్త్ర) లో కొలుస్తారు. దీనిలో రెండు రకాల రీడింగ్ లు ఉంటాయి. మొదటిది సిస్టోలిక్ రీడింగ్, ఇది గుండె సంకో చించినప్పుడు ధమని గోడపై ఒత్తిడిని తెలియజేస్తుంది. రెండవది డయాస్టోలిక్ రీడింగ్, ఇది గుండె సడలించినప్పుడు బీట్ ల మధ్య ఒత్తిడిని తెలియజేస్తుంది. 120/80 ఎఎ నస్త్ర రీడింగ్ సాధారణ రక్తపోటుగా పరిగణించబడు తుంది. అలాగే పై రీడింగ్ 120 నుండి 129 మధ్యలో, కింద రీడింగ్ 80 కంటే తక్కువగా ఉంటే అధిక రక్తపోటుగా పరిగణిస్తారు. అలాగే పైసంఖ్య 130 నుండి 139 మధ్యన, దిగువ సంఖ్య 80 నుండి 89 మధ్యన ఉన్నట్లయితే దానిని ఒకటవ దశ రక్తపోటుగా పరిగణిస్తారు. అలాగే పైసంఖ్య 140 కంటే ఎక్కువగా దిగువ సంఖ్య 90 కంటే ఎక్కువగా ఉంటే 2వ దశ రక్తపోటుగా పరిగణిస్తారు. అదే విధంగా 180/120 mm Hg కంటే ఎక్కువ రీడింగ్ ను హైపర్ టెన్సివ్ ఎమర్జెన్సీగా పరిగణిస్తారు. దీనికి తక్షణ వైద్య సహాయం తీసుకోవాల్సి వస్తుంది. ఇక రక్తపోటుతో బాధపడే వారు రోజూ వ్యాయామం చేయాలి. ఉప్పును తక్కువగా తీసుకోవాలి. ప్యాక్ చేసిన ఆహారాలకు దూరంగా ఉండాలి. తృణ ధాన్యాలను, కూరగాయ లను, పండ్లను ఎక్కువగా తీసుకోవాలి. మాంసాన్ని తీసుకోవడం తగ్గించాలి. శరీర బరువు అదుపులో ఉండేలా చూసుకోవాలి. ఒత్తిడిని అదుపులో ఉంచుకోవడానికి యోగా, ధ్యానం వంటివి చేయాలి. ధూమ పానం మానేయాలి. ఈ విధమైన జాగ్రత్తలు తీసుకోవడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. గుండె ఆరోగ్యం మెరుగుపడు తుంది. గుండె జబ్బులు వచ్చే అవకాశం తక్కువగా ఉంటుంది. ఈ విధమైన జాగ్రత్తలు తీసుకోవడం వల్ల రక్తపోటు వచ్చే అవకాశాలు కూడా తక్కువగా ఉంటాయని వైద్యులు చెబుతున్నారు.

# కళ్ల కింద నల్లటి వలయాలు ఏలా పోతాయి?



కళ్ల కింద నల్లటి వలయాలు జీవన విధానంతో పాటు ఆరోగ్యం గురించి కూడా తెలియజేస్తాయి. కళ్ల కింద నల్లటి వలయాలకు ఎన్నో కారణాలుంటాయి. ఓ క్రమం లేకుండా నిద్రపోవడం, వేళకు ఆహారం తీసుకోకపోవటం, అనారోగ్యకర జీవన విధానం, దీర్ఘకాలం పాటు ఉన్న అనారోగ్యం, జన్యువుల కారణాలు ఉండవచ్చు. కారణం ఏదైనా అవి ముఖాన్ని అందవిహీనం చేస్తాయి. నల్లటి వలయాలు మిమ్మల్ని నిస్తేజంగా, అలసటగా కనిపించేలా చేస్తాయి. కాబట్టి వాటిని నివారించాలని ప్రతి ఒక్కరూ భావిస్తారు. కాలేజీకి వెళ్లే యువకుల నుంచి ఉద్యోగాలు చేసే అతివలు, అబ్బాయిల వరకు అందిరినీ ఇబ్బంది పెట్టే సమస్య కళ్లకింద నల్లటి వలయాలు. అయితే ఇవి వచ్చాక వీటిని తగ్గించుకోవడానికి రకరకాలుగా ప్రయత్నిస్తూ ఉంటారు. మార్కెట్‌లో లభించే క్రీములు, లోషన్స్ నుంచి.. వంటింటి చిట్కాల వరకు అన్నింటినీ పాటిస్తుంటారు. అయితే కళ్ల కింద నల్లటి వలయాలు పోగొట్టుకునేందుకు చికిత్స ప్రారంభించే ముందు మీకు తెలియని కొన్ని వాస్తవాల గురించి తెలుసుకోవాలి. కంటి చుట్టూ ఉండే చర్మం చాలా సున్నితంగా ఉంటుంది. అలసట, వృద్ధాప్య సంకేతాలను చూపించే మొదటి ప్రాంతం కంటి కింద చర్మమే. అందువల్ల కంటి చుట్టూ ఉండే చర్మం ఎలా ప్రవర్తిస్తుందో తెలుసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. కంటి కింద ప్రాంతాన్ని మనం వేసుకునే బట్టలతో పోల్చి చూడాలని కొందరు వైద్య నిపుణులు చెప్తున్నారు. 'ఎందుకంటే మన కంటి చుట్టూ ఉండే చర్మం చాలా సున్నితంగా ఉంటుంది. ఎలాంటి రాపిడి తగిలినా ఆ చర్మం కందిపోతుంది. కంటి చుట్టూ ఉండే చర్మం పత్తి లాంటిది అయితే మిగతా శరీర భాగాల్లోని చర్మం డెనిమ్ లాంటిది. మీరు కాటన్, సిల్క్, నైలాన్ దుస్తులను వేర్వేరు పద్ధతుల్లో ఉతికినట్లే.. కంటి చుట్టూ ఉండే చర్మం, మిగతా భాగాల్లోని చర్మం కూడా వేర్వేరుగా ఉంటుందని గ్రహించాలి. తద్వారా మనం చర్మ సంరక్షణ కోసం తగు జాగ్రత్తలు తీసుకోవాలి' అని డెర్మటాలజిస్టులు సూచిస్తున్నారు. కంటి చుట్టూ ఏర్పడే నల్లటి వలయాలు కొన్ని స్కిన్ అలర్జీల వల్ల ఉత్పన్నం అవుతాయని డెర్మటాలజిస్టులు చెప్తున్నారు. అందువల్ల వాటిని అలర్జీ షైనర్స్ అని అంటారని వారు పేర్కొన్నారు. డార్క్ సర్కిల్స్ అనేవి మూత్రపిండాలు లేదా అడ్రినల్ అసమతుల్యతలను సూచిస్తాయని వారు వెల్లడించారు. శరీరంపై అధిక ఒత్తిడి భారం ఉన్నప్పుడు లేదా సరైన నిద్ర లేనప్పుడు ఇలాంటి స్కిన్ అలర్జీలు వస్తాయని వారు తెలిపారు. ధూమపానం, మద్యపానం లాంటి అలవాట్లు కూడా నల్లటి వలయాలకు దారితీస్తాయని చర్మ వైద్యులు వెల్లడించారు. ఆల్కహాల్ తాగడం వల్ల కళ్ల కింద రక్తనాళాలు కుచించుకుపోతాయని, తద్వారా నల్లటి వలయాలు మరింత ప్రముఖంగా కనిపిస్తాయని వారు పేర్కొన్నారు. ఆల్కహాల్ నిద్రను కూడా ప్రభావితం చేస్తుందని, నిద్ర సరిగ్గా లేకపోవడం వల్ల కళ్ల కింద నల్లటి వలయాలు ఏర్పడే సమస్య మరింత తీవ్రతరం అవుతుందని వారు తెలిపారు.

కీర దోసను ముక్కలుగా కట్ చేసి కాసేపు ఫ్రిజ్‌లో పెట్టాలి. తరువాత వాటిని పావుగంట పాటు కళ్లపై పెట్టుకోవాలి. ఇలా చేయడం వల్ల కళ్లకు తగిన విశ్రాంతి లభిస్తుంది. నల్లటి వలయాలు నెమ్మదిగా దూరమవుతాయి. సాధారణంగా అలోవెరా అందరి ఇళ్లలో ఉంటుంది. ఇది చర్మానికి అవసరమైన మాయిశ్చర్‌ను అందిస్తుంది. దీని వల్ల ఎన్నో ఉపయోగాలు

# తగ్గిన చింతపండు దిగుబడి

## జీసీసీ కొనుగోలు ధర కిలో రూ.36



**గుమ్మలక్ష్మీపురం, పతాకం న్యూస్:** గిరిజనులు పండిస్తోన్న అటవీ ఉత్పత్తుల దిగుబడి క్రమేణ తగ్గుతూ వస్తుంది. ఎక్కువ శాతం ఆదివాసీలు తరతరాల నుంచి అడవినే నమ్ముకుని పోడు వ్యవసాయంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ప్రధానంగా చింతపండు, జీడి, మామిడి పంటలపై ఎక్కువగా ఆశలు పెట్టుకుంటారు. ఒకవైపు పండించిన పంటలకు ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడం, గిట్టుబాటు ధర కల్పించకపోవడం, దళారుల బెడద ఎక్కువగా ఉండడంతో పండిస్తున్న పంటలకు తగిన ప్రతిఫలం లేకుండా పోతుంది. దీనికి తోడు గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది చింతపండు దిగుబడి తగ్గుముఖం పట్టింది. ఆశించినంతగా పంట చేతికి వచ్చే పరిస్థితి లేదని గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. గత మూడేళ్లుగా జీడి పంట దిగుబడి తగ్గింది. ఈ ఏడాదైనా దిగుబడి, ధర ఆశాజనకంగా ఉంటుందని ఆశించారు. చింతపండు సేకరణకు పిల్లాపాపలతో కొండలు, గుట్టలపై ఉన్న చింతచెట్ల వద్దకు వెళ్లి ఎంతో కష్టపడి చింత బొట్టలను ఏరి పెంకులు తీసి అమ్మకం కోసం కిలోమీటర్లు కాలినడకన మండల కేంద్రానికి, వారపు సంతలకు, జిసిసి కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తున్నారు. తీరా గిట్టుబాటు ధర లభించక తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వస్తుంది. మరోవైపు జిసిసి నిబంధనలు గిరిపుత్రులకు ఆందోళన కలిగిస్తున్నాయి. జిసిసి కొనుగోలు కేంద్రాలకు గిరిజనులు చింతపండు అమ్మకానికి తీసుకొస్తే నాణ్యత సరిగాలేదని, పొడిగా లేదని, తడిచిన చింతపండు తీసుకొచ్చారని వంకలు పెడుతున్నారు. జిల్లాలోని గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియమ్మవలస, కొమరాడ, పాచిపెంట, మక్కువ, సీతంపేట, భామిని మండలాల్లో 70 వేలకుపైగా చింత చెట్లు ఉన్నాయి.

ఏటా సుమారు పది వేల క్వింటాళ్ల చింతపండు దిగుబడి వస్తుందని అంచనా. గిరిజనులు సేకరించిన చింతపండును గిరిజన సహకార సంస్థ కొనుగోలు చేస్తుంది. అనంతరం టెండర్లు పిలిచి వర్తకుల ద్వారా మైదాన ప్రాంతాలకు తరలిస్తుంటారు. ఇక్కడే అసలు సమస్య మొదలైంది. జిసిసికి జిల్లాలో కోల్డ్ స్టోరేజ్ లేకపోవడంతో పంట నిల్వలను ఇతర ప్రాంతాల్లో భద్రపరచాల్సిన పరిస్థితి. గిరిజనులు సేకరిస్తున్న చింతపండుకు టెండర్లు పిలుస్తున్నప్పటికీ జిసిసి కొనుగోలు చేస్తున్నా ధర రావడం లేదు. ఆ సంస్థ పూర్తి స్థాయిలో కొనుగోలుకు ఆసక్తి చూపడం లేదు. నాణ్యత లేదని, తడిపిన చింతపండు తీసుకొస్తున్నారని రకరకాల కారణాలు చూపుతూ అంతంతమాత్రంగానే అధికారులు కొనుగోలు చేస్తున్నారని గిరిజలను ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో దళారులను ఆశ్రయించి తక్కువ ధరకే పంటను అమ్ముకోవాల్సి వస్తోంది. గిరిజనుల నుంచి చింతపండు కొనుగోలు చేసిన దళారులు కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ ఉంచి మంచి ధర పలికినప్పుడు విక్రయిస్తున్నారు. ఎంతో కష్టపడి గిరిజనులు చింతపండు సేకరిస్తున్నా గిట్టుబాటు లభించడం లేదు.

# విపక్ష ఎంపీల తీరుపై మరో వీడియో రిలీజ్ చేసిన కిరణ్ రిజిజు



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** పార్లమెంట్ లో కాంగ్రెస్ సహా విపక్ష ఎంపీల ప్రవర్తనపై కేంద్రమంత్రి కిరణ్ రిజిజు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. లోక్ సభలో కాంగ్రెస్ ఎంపీల రగడ అందరూ చూశారని అన్నారు. ఆ తర్వాత స్పీకర్ ఓం బిర్లా ఛాంబర్ లోకి దూసుకెళ్లి మరీ ఆయనను, ప్రధాని మోదీని కాంగ్రెస్ ఎంపీలు దుర్భాషలాడారని ఆరోపించారు. సభలో విపక్ష ఎంపీలు చేసిన రగడకు సంబంధించిన వీడియోను ఇప్పటికే రిలీజ్ చేసిన కేంద్ర మంత్రి.. తాజాగా స్పీకర్ ఛాంబర్ లో జరిగిన సంఘటనకు సంబంధించిన వీడియోను ఈ రోజు ఉదయం ఎక్స్ లో పోస్ట్ చేశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చేపట్టిన చర్చలో ప్రధాని మోదీని చుట్టుముట్టే ప్రయత్నం జరిగిందని స్పీకర్ ఓం బిర్లా ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ విషయంపై విశ్వసనీయ సమాచారం అందడంతో ప్రధాని మోదీని సభకు రావొద్దని తానే సూచించినట్లు ఆయన వెల్లడించారు. ఈ విషయంపై కాంగ్రెస్ సహా విపక్ష ఎంపీలు లోక్ సభలో తీవ్ర ఆందోళన చేశారు. అనంతరం స్పీకర్ ఛాంబర్ లోకి దూసుకెళ్లి అక్కడ కూడా గందరగోళం సృష్టించారు. కిరణ్ రిజిజు షేర్ చేసిన తాజా వీడియోలో.. స్పీకర్ ఓం బిర్లా ఛాంబర్ లోపల పెద్ద సంఖ్యలో ఎంపీలు గట్టిగా మాట్లాడటం కనిపిస్తోంది. కిరణ్ రిజిజు సహా పలువురు కేంద్ర మంత్రులు, పలువురు బీజేపీ ఎంపీలు మరో పక్క నిల్చుని ఉండడం చూడొచ్చు. స్పీకర్ ఛాంబర్ లో జరిగిన ఉదంతానికి సంబంధించిన వీడియోను షేర్ చేస్తూ కేంద్రమంత్రి కిరణ్ రిజిజు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పీకర్ ఛాంబర్ లో ఆయన అనుమతి లేకుండా వీడియో తీయడం చట్టవిరుద్ధమని, ఈ వీడియోను కాంగ్రెస్ ఎంపీ ఒకరు తీశారని కేంద్ర మంత్రి చెప్పారు. దాదాపు 20 నుంచి 25 మంది కాంగ్రెస్ ఎంపీలు స్పీకర్ ఛాంబర్ లో గట్టిగా మాట్లాడుతుండటం ఈ వీడియోలో చూడొచ్చని అన్నారు.స్పీకర్ ను దుర్భాషలాడటంతో పాటు ప్రధాని మోదీపై బెదిరింపు వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. ఎంపీలు ఇలా బెదిరింపులకు పాల్పడటాన్ని తాము ఎప్పటికీ ప్రోత్సహించబోమని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఈ పోస్టులో పేర్కొన్నారు.




## 2027లో జరిగే వన్డే ప్రపంచ కప్ గెలవాలనేదే నా లక్ష్యం.. రోహిత్ శర్మ



టీమిండియా వెటరన్ ప్లేయర్ రోహిత్ శర్మ.. టెస్టు, టీ20 ఫార్మాట్లకు వీడ్కోలు పలికి కేవలం వన్డేల్లోనే కొనసాగుతున్న విషయం తెలిసిందే. 2027లో జరిగే వన్డే ప్రపంచ కప్ గెలవాలనే పట్టుదలతోనే ముందుకు సాగుతున్నాడు. దానికోసమే ఫిట్‌నెస్ పరంగా, ఫామ్ పరంగానూ అదరగొడుతున్నాడు. మరి ఆ మెగా టోర్నీలో రోహిత్‌కు అవకాశం దక్కుతుందా? లేదా? అనే అనిశ్చితి కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో హిట్‌మ్యాన్ వన్డే వరల్డ్ కప్ 2027 గురించి కీలక వ్యాఖ్యలు చేశాడు.

'నా దేశం కోసం ప్రపంచ కప్ నెగ్గాలని కోరుకుంటున్నాను. వన్డే వరల్డ్ కప్ మ్యాచ్‌లు చూస్తూ పెరిగాను. అప్పట్లో టీ20 ప్రపంచ కప్, ఐపీఎల్ వంటి టోర్నీలు లేవు. అయితే నాలుగేళ్లకు ఒకసారి జరిగే వన్డే ప్రపంచ కప్‌నకు మాత్రం ఎంతో విలువ ఉంది. ప్రస్తుతం ఆ ట్రోఫీ గెలవాలనేదే నా లక్ష్యం. దాన్ని గెలిచేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తా' అని రోహిత్ శర్మ ఓ ఐసీసీ ఈవెంట్‌లో అన్నాడు.

మరోవైపు ఇటీవలే బీసీసీఐ ఆటగాళ్లకు సంబంధించి సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితాను ప్రకటించింది. ఇందులో రోహిత్ శర్మ గ్రూప్ ఏ ప్లస్ నుంచి గ్రూప్ బికి మారిన సంగతి తెలిసిందే. గ్రూప్ ఏ ప్లస్ కేటగిరీని తొలగించిన బీసీసీఐ.. ఇప్పుడు గ్రూప్ ఏ, బి, సి కేటగిరీలను మాత్రమే కేటాయించింది. కాగా గ్రూప్ ఏలో శుభ్‌మన్ గిల్, బుమ్రా, రవీంద్ర జడేజా మాత్రమే చోటు దక్కించుకున్నారు. టెస్టు, టీ20 ఫార్మాట్లకు వీడ్కోలు పలికిన విరాట్ కోహ్లీ కూడా గ్రూప్ బికి మారిన విషయం తెలిసిందే.

## పసికూన నమీబియాపై

# టీమిండియా ప్రతాపం చూపేనా?



టీ20 ప్రపంచకప్ తమ తొలి మ్యాచ్‌లో అమెరికా చేతిలో తడబాటుకు లోనైన టీమిండియా బ్యాటర్లు.. తదుపరి పోరులో జూలు విదల్చాలనుకొంటున్నారు. గ్రూప్-ఎలో జరిగే తమ రెండో మ్యాచ్‌లో పసికూన నమీబియాతో డిఫెండింగ్ చాంపియన్ భారత్ తలపడనుంది. బలాబలాలపరంగా చూస్తే టీమిండియాకు నమీబియా ఏమాత్రం సరితూగే ప్రత్యర్థికాదు. కానీ, ఆదివారం పాకిస్థాన్‌తో జరగబోయే మ్యాచ్‌కు ముందు నమీబియాతో పోరును వామ్పగా పరిగణించాలి. అయితే, కడుపునొప్పితో ఆసుపత్రిలో చేరిన ఓపెనర్ అభిషేక్ వర్మ డిశ్చార్జ్ అయ్యాడు. కానీ, అతడిని ఆడించే అవకాశాలు తక్కువే. ఈ నేపథ్యంలో అభిషేక్ స్థానంలో సంజూ శాంసన్‌కు చాన్స్ లభించవచ్చు.

అనారోగ్యం నుంచి కోలుకొన్న పేసర్ బుమ్రా బరిలోకి దిగనుండడం శుభ పరిణామం. కెప్టెన్ సూర్యకుమార్ సూపర్ ఫామ్‌లో ఉండగా.. పాక్‌తో మ్యాచ్‌కు ముందు ఓపెనర్ ఇషాన్ కిషన్, తిలక్, హార్దిక్ పాండ్యా, రింకూ సింగ్ టచ్‌లోకి రావడం ఎంతో ముఖ్యం. అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి స్పిన్ విభాగాన్ని నడిపించనున్నారు. మరోవైపు నమీబియా మెరుగైన ప్రదర్శనతో ఆకట్టుకోవాలనుకొంటోంది. కెప్టెన్ గెరార్డ్ ఎరాస్మస్, ఆల్‌రౌండర్ జేజే స్మిత్ మినహా జట్టులో చెప్పుకోదగ్గ బ్యాటర్లు లేరు.

**భారత్:** అభిషేక్/సంజూ శాంసన్, ఇషాన్, తిలక్ వర్మ, సూర్యకుమార్ (కెప్టెన్), హార్దిక్ పాండ్యా, రింకూ సింగ్, శివం దూబే, అక్షర్, అర్ష్‌దీప్, బుమ్రా/సిరాజ్, వరుణ్ చక్రవర్తి.




# త్వరలో రామ్ చరణ్, సుకుమార్ చిత్రం!



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ అభిమానులకు పండగలాంటి వార్త అందింది. 'రంగస్థలం' వంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత రామ్ చరణ్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో రాబోతున్న కొత్త సినిమా షూటింగ్ ప్రారంభానికి ముహూర్తం ఖరారైనట్టు తెలుస్తోంది. శ్రీరామనవమి పర్వదినమైన మార్చి 26న ఈ చిత్రం పూజా కార్యక్రమాలు ఉంటాయని టాక్ వినిపిస్తోంది. మార్చి 27న రామ్ చరణ్ పుట్టినరోజు కాగా, దానికి ఒకరోజు ముందు పవిత్రమైన శ్రీరామనవమి రోజునే ఈ ప్రాజెక్ట్‌ను ప్రారంభించే అవకాశాలున్నాయి. ఈ సందర్భంగా సినిమాకు సంబంధించిన ప్రత్యేక పోస్టర్ లేదా టైటిల్ అనౌన్స్‌మెంట్ వెలువడవచ్చని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. 'రంగస్థలం' తర్వాత ఈ క్రేజీ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి.ఇదిలా ఉండగా, రామ్ చరణ్ నటిస్తున్న మరో చిత్రం 'పెద్ది' నుంచి ఆయన పుట్టినరోజు (మార్చి 27) నాడు ప్రత్యేక అప్‌డేట్ రానున్నట్లు తెలుస్తోంది.

బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని ఏప్రిల్ 30న విడుదల చేయనున్నారు. 'పెద్ది' దర్శకుడు బుచ్చిబాబు సుకుమార్ శిష్యుడు కావడం, ఆ సినిమా నిర్మాణంలో సుకుమార్ భాగస్వామిగా ఉండటంతో ఈ రెండు ప్రాజెక్టులపైనా ప్రేక్షకుల్లో ఆసక్తి రెట్టింపు అయ్యింది. ఇటీవలే కవల పిల్లలకు తండ్రైన రామ్ చరణ్‌కు, ఆయన అభిమానులకు మార్చి నెల డబుల్ బొనాంజాగా మారనుంది. ఒకవైపు సుకుమార్ సినిమా ప్రారంభం, మరోవైపు 'పెద్ది' నుంచి సర్‌ప్రైజ్ అప్‌డేట్‌తో ఫ్యాన్స్ సంబరాలకు సిద్ధమవుతున్నారు.

# 'స్వయంభు'ను ఆదరించండి : నిఖిల్



"హ్యాపీ డేస్' సినిమా వచ్చి 19 ఏళ్లవుతోంది. ఇది నా 22వ సినిమా. 'స్వయంభు' సినిమాను ఒళ్లు దగ్గర పెట్టుకుని చేశా. ఈ జర్నీలో ఎన్నో ఎత్తుపల్లాలు చూశా. అన్ని సమయాల్లో మీరంతా తోడున్నారు. గత రెండేళ్లుగా నేను కనిపించలేదు. కార్తికేయ 2 తర్వాత మంచి సినిమాతో మీ ముందుకు రావాలనుకున్నాను. ఒళ్లు దగ్గర పెట్టుకుని, భయపడుతూ, జాగ్రత్తగా చేసిన సినిమా స్వయంభు. నిఖిల్ మావాడు అని గర్వంగా చెప్పుకునేలా ఈ వంగా వీ ఉంటుంది. ఎంతోమంది పోరాటయోధుల వల్లే మన దేశం ఈరోజు ఇలా ఉంది. కొన్నిసార్లు వారి గురించి మన పుస్తకాల్లో కూడా ఉండదు. వెయ్యేండ్ల కిందట జరిగిన కథ ఇది. యథార్థ సంఘటనల ఆధారంగా ఈ సినిమా తీశాం' అని కథానాయకుడు నిఖిల్ అన్నారు. 'కార్తికేయ 2' సినిమాతో ఘన విజయం అందుకున్న నిఖిల్ 'స్వయంభు'తో త్వరలో ప్రేక్షకులను అలరించబోతున్నారు. 'స్వయంభు' సినిమా టీజర్‌ను బుధవారం ఆయన విడుదల చేసి మాట్లాడారు. నిఖిల్‌కు జోడీగా నభా నటేష్, సంయుక్త నటిస్తున్నారు. సునీల్ సుబ్బరాజు, సత్య కీలక పాత్రలు పోషించారు. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో భువన్, శ్రీకర్ నిర్మించారు. రవి బస్రూర్ సంగీతం అందించారు. రాబోయే వేసవిలో ఈ సినిమా విడుదల కానుంది.

# ఎన్నో కష్టాలు పడ్డాను: స్రవంతి



బుల్లితెరపై .. ఈవెంట్స్ లోను సందడి చేసే కొంతమంది యాంకర్స్ కి హీరోయిన్స్ తో సమానమైన క్రేజ్ ఉందనడంలో ఎంతమాత్రం అతిశయోక్తి లేదు. అలాంటి అతికొద్ది మంది యాంకర్స్ లో స్రవంతి ఒకరు. స్రవంతి గ్లామర్ కీ .. ఆమె మాట తీరుకీ .. నవ్వుకి యూత్ వైపు నుంచి చాలామంది అభిమానులు ఉన్నారు. ఒక రకంగా హీరోయిన్స్ కి ఉండవలసిన లక్షణాలు ఆమెలో ఉన్నాయని భావిస్తుంటారు. అయితే ఆమె మాత్రం యాంకర్ గానే కొనసాగుతూ వెళుతున్నారు.

తాజాగా ఓ ఇంటర్వ్యూలో స్రవంతి మాట్లాడుతూ .. "నేను హైదరాబాద్ కి వచ్చిన కొత్తలో ఒక వైపున చదువుకుంటూనే మరో వైపున డాన్స్ నేర్చుకునేదానిని. ఒకసారి నేను మా ఫ్రెండ్ తో కలిసి 'మహంకాళి' సినిమా షూటింగుకి వెళ్లాను. అక్కడ జర్నలిస్ట్ గా చేయవలసిన ఆర్టిస్ట్ రాకపోవడంతో నాతో చేయించారు. రోజుకి 3 వేల రూపాయలు ఇచ్చారు. ఇదేదో బాగుందే అనిపించింది. ఆ సమయంలోనే నేను ప్రేమలో పడ్డాను. వాళ్ల ఫ్యామిలీకి ఇష్టం లేదని తెలిసి సినిమాలు మానేశాను" అని అన్నారు.

"పెళ్లి తరువాత ఆయన బిజినెస్ దెబ్బతింది. దాంతో నేను జాబ్ చేయవలసి వచ్చింది. ఒక జ్యుయలరీ షాపులో సేల్స్ గర్ల్ గా పనిచేశాను. ఉదయం నుంచి రాత్రి వరకూ కూర్చోకూడదు. అలా ఏడాదిన్నర పాటు పనిచేశాను. ఇక నా వల్ల కాదనిపించి మానేశాను. ఆ తరువాత నుంచి యాంకరింగ్ వైపు వచ్చాను. బన్నీతో చేసిన ఒక ఇంటర్వ్యూ నన్ను 'బిగ్ బాస్'కి తీసుకుని వెళ్లింది. ఆ డబ్బు నాకు చాలా హెల్ప్ అయింది"అంటూ ఆమె కన్నీళ్లు పెట్టుకున్నారు.




Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**